ప్రజాశక్తి

ఆదివారం 20 ఏప్రిల్ 2025 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



సభలో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి మంజీర్ జిలానీ

ఎలక్ట్రానిక్ వ్యర్థాలను అప్పగించండి

- జిల్లా ప్రత్యేకాధికారి మంజీర్ జిలానీ పిలుపు

ప్రజాశక్తి - గన్నవరం : ఎలక్ట్రానిక్ వ్యర్థాలను రోడ్లపై పారవేయకుండా పంచాయతీల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెంటర్లో అప్పగించాలని జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మంజీర్ జిలానీ సమూన్ ప్రజలకు పిలుపునిచ్చారు. కృష్ణాజిల్లా గన్నవరం మండలం బుద్ధవరం పంచాయతీ పరిధిలోని దావాజీగూడెం గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అనేక నూతన ప్రోగ్రామ్స్‌ను అందుబాటులోకి తీసుకొస్తుందని, అందులో స్వచ్ఛ ఆంధ్ర అనేది చాలా ముఖ్యమైన ప్రోగ్రాం అని అన్నారు. దీనికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చి కోట్ల రూపాయలు ఖర్చు పెడుతోందన్నారు. గ్రామాల వారీగా కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం అధికారులు చిత్తశుద్ధితో పని చేస్తున్నారని చెప్పారు. ప్రజలు కూడా సహకరిస్తే ఈ కార్యక్రమం పూర్తి విజయవంతం అవుతుందన్నారు. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాల వలన అటు భూమికి, ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుందన్నారు. అందువలన ఎలక్ట్రానిక్ తీర్థాలను బయట పారవేయకుండా సేకరణ కోసం ప్రతి పంచాయతీలో ఒక సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలందరూ వాటిని ఆయా సెంటర్లలో అప్పగిస్తే ప్రకతికి ఇబ్బంది కలగకుండా వాటిని కాల్చివేస్తారని తెలిపారు. ఒక్క రోజుతో శానిటేషన్ పూర్తి చేయడం సాధ్యం కాదని, రోజూ జరుగుతూనే ఉండాలన్నారు. బాగా పనిచేస్తున్న

(మిగతా 2లో)

పట్టణాల్లో పన్ను పోటు !

- ఎస్సెస్‌మెంట్లు 1,40,191
- 2024-25లో పన్ను డిమాండ్ రూ. 39.64 కోట్లు
- 2025-26లో రూ.52.31 కోట్లు
- గతేడాదికన్నా పెరిగిన భారం రూ.12.67 కోట్లు



ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ప్రభుత్వాలు మారినా ప్రజలపై పన్నుల మోత తప్పడం లేదు. నగర పాలక సంస్థలు (కార్పొరేషన్లు), పురపాలక సంస్థ (మున్సిపాల్టీలు) ల్లో గత ప్రభుత్వం తీసుకు వచ్చిన విలువ ఆధారిత ఆస్తి పన్ను విధానాన్ని కూటమి ప్రభుత్వం కొనసాగిస్తోంది. దీనికితోడు ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ పట్టణాల్లో ఆస్తి, కట్టడాల విలువను భారీగా పెంచింది. దీంతో నగరాలు, పట్టణాల్లో ఆస్తి పన్నుల మోత మోగుతోంది. ఈ నేపథ్యంలో కృష్ణాజిల్లా మచిలీపట్నం నగరపాలక సంస్థ, గుడివాడ, పెడన, ఉయ్యూరు, తాడిగడప మున్సిపాల్టీల్లో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.39.64 కోట్లు ఉన్న ఆస్తి పన్ను డిమాండ్ 2025-26లో రూ.52.31 కోట్లకు పెరగనుంది. ఆయా ప్రాంతాల్లో ఉన్న లక్షా 40 వేల 191 ఎస్సెస్‌మెంట్ల యజమానులపై రూ.12.67 కోట్ల అదనపు భారం పడింది. ఇది పరోక్షంగా అద్దెదారులపైనా పడుతుంది.

మరోవైపు నగర పాలక సంస్థ, మున్సిపాల్టీల్లో స్థలాలు, ఆ స్థలాల్లో నిర్మాణమైన గృహ, వాణిజ్య భవనాల విలువను స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ 2025 ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి పెంచింది. మచిలీపట్నం నగర పాలక సంస్థ, తాడిగడప, గుడివాడ, పెడన, ఉయ్యూరు మున్సిపాల్టీల్లో ఆస్తి విలువను 10 శాతం నుంచి 15 శాతం వరకు పెంచింది.

ఈ విలువ ఆధారంగా గృహాలకు 0.15 శాతం (లక్షకు రూ.150), వాణిజ్య భవనాలకు 0.30 శాతం (లక్షకు రూ.300) పన్ను విధించింది. తాజాగా నూతన పన్ను డిమాండ్లు నగర పాలక సంస్థ, మున్సిపాల్టీల్లో అందుబాటులోకి వచ్చాయి. ఈ డిమాండ్ల ఆధారంగా త్వరలోనే వసూలు ప్రక్రియను ప్రారంభించడానికి కసరత్తు చేస్తున్నారు.

నగరాలు, పట్టణాల్లో పన్నుపోటు ఇలా

నగరపాలక సంస్థ, మున్సిపాల్టీల్లో గత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే ఈ ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్నులు భారీగా పెరిగాయి. తాడిగడపలో రూ.5.1 కోట్లు, మచిలీపట్నంలో రూ.2.81 కోట్లు, గుడివాడలో రూ.2.81 కోట్లు, ఉయ్యూరులో రూ.1.02 కోట్లు, పెడనలో రూ.55 లక్షలు అదనంగా ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

పట్టణం/నగరం	ఎస్సెస్‌మెంట్లు	2024-25లో పన్ను డిమాండ్	2025-26లో పన్ను డిమాండ్
తాడిగడప	46,786	రూ.15.70 కోట్లు	రూ.20.71 కోట్లు
మచిలీపట్నం	49,009	రూ.11.27 కోట్లు	రూ.14.08 కోట్లు
గుడివాడ	26,706	రూ.08.92 కోట్లు	రూ.11.73 కోట్లు
ఉయ్యూరు	10,119	రూ.03.16 కోట్లు	రూ.04.18 కోట్లు
పెడన	07,571	రూ.01.06 కోట్లు	రూ.01.61 కోట్లు
మొత్తం	1,40,191	రూ.39.64 కోట్లు	రూ.52.31 కోట్లు

ఎంఎల్‌ఎ వసంతకు హైడ్రా షాక్

ప్రజాశక్తి - మైలవరం : మైలవరం నియోజకవర్గ టిడిపి ఎంఎల్‌ఎ వసంత కృష్ణ ప్రసాద్‌కు హైడ్రా షాక్ తగిలింది. హైదరాబాద్‌లోని కొండాపూర్ పరిధిలో ప్రభుత్వ భూముల్లో ఆయన చేపట్టిన అక్రమ కట్టడాలను శనివారం ఉదయం హైడ్రా అధికారులు కూల్చేశారు. కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకుని ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టారు. కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయ సమీపంలోని సర్వే నెంబర్ 79లో 39 ఎకరాల స్థల వివాదంపై హైడ్రాకు ఫిర్యాదు అందింది. దీంతో భారీ పోలీసు బందోబస్తుతో అక్కడికి చేరుకున్న హైడ్రా అధికారులు... వసంత కృష్ణ ప్రసాద్‌కు చెందిన స్థలం చుట్టూ ఉన్న ఫెన్సింగ్‌తోపాటు భారీ షెడ్లను జేసీబీలతో తొలగించారు. కూల్చివేతలను అడ్డుకునేందుకు ఆయన కుటుంబ సభ్యులు ప్రయత్నించగా.. భారీ పోలీస్ బందోబస్తు నడుమ కూల్చివేతలు కొనసాగించారు. ఈ క్రమంలో వసంత హౌస్ పేరుతో ఏర్పాటు చేసిన ఆఫీస్‌తోపాటు భారీ షెడ్లను తొలగించారు.



హైడ్రా కూల్చివేసిన భవనం

నేడు ప్రజారోగ్య వేదిక ఆరోగ్య సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం 4వ అంతస్తులో జన విజ్ఞాన వేదిక, ఎంబి విజ్ఞాన కేంద్రం, ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు రాష్ట్రస్థాయి ఆరోగ్య సదస్సు జరుగుతుంది. "వైద్య ఆరోగ్య రంగం, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ - ప్రభావాలు", "ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య బడ్జెట్ - విశ్లేషణ" అంశాలపై జరిగే ఈ సదస్సుకు ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.వి రమణయ్య అధ్యక్షత వహిస్తారు. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మాజీ కార్యదర్శి, రిటైర్డ్ ఐఎఎస్ డాక్టర్ పి.వి రమేష్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మాజీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి సమరం, మాజీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బి.రామ్ ప్రసాద్, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎ.పూర్ణానంద్, ప్రముఖ వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ మాకినేని కిరణ్, ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు పాల్గొంటారు. ఈ మేరకు ప్రజారోగ్య వేదిక ఆర్గనైజింగ్ కన్వీనర్ జి.విజయ్ ప్రకాష్, జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, ఎంబివికె కార్యదర్శి పి.మురళీకృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు.

రంగాపురం భూములపై కన్ను

- పలాస ఎంఎల్‌ఎ అనుచరుల దౌర్జన్యంపై బాధిత రైతుల ఆవేదన
- కోర్టు పరిధిలో ఉన్నా చెట్లు నరికేశారని ఆగ్రహం
- భూములకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : శ్రీకాకుళం జిల్లా పలాస ఎంఎల్‌ఎ అనుచరులు తమ భూముల్లోని మామిడి చెట్లను నరికి ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఎన్‌టిఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం రంగాపురం గ్రామానికి చెందిన సుమారు 21 మంది రైతు కుటుంబాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంఎల్‌ఎ శిరీష, ఆమె భర్త వెంకన్న చౌదరి, కుటుంబ సభ్యుడు గౌతు శ్యాంసుందర్ శివాజీ అనుచరుల నుండి తమ భూములకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు. బాధిత రైతుల కథనం ప్రకారం.. 1956లో మాజీ మంత్రి సర్దార్ గౌతు లచ్చన్న భార్య గౌతు యశోదరాదేవి రెడ్డిగూడెం మండలం రంగాపురం గ్రామ సర్వే నెంబరు 192లోని వంద ఎకరాల మెట్ట భూమిని రంగాపురం జమీందారు అడుసుమెల్లి విశ్వేశ్వరరావు నుండి కొనుగోలు చేశారు. అనంతరం ఆ భూమిని 1963 నుండి 1971 వరకు విడతల వారీగా రంగాపురం గ్రామానికి చెందిన చిన్న, సన్నకారు రైతులకు యశోదరాదేవి విక్రయించారు. యాజ్ ఫర్ సేల్ కింద 100 ఎకరాల (రెవెన్యూ రికార్డుల ప్రకారం 98.84 ఎకరాలు) భూమిలో 92.10 ఎకరాలను 21 మంది సన్న, చిన్నకారు రైతులకు ఆమె ప్రత్యక్షంగా, పరోక్షంగా విక్రయించారు. ఇక మిగిలిన

(మిగతా 2లో)

రైతుల మామిడి తోటలో నరికిన చెట్లు; చిత్రంలో బాధిత రైతులు



ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత

ఉదయభాను చర్యను వ్యతిరేకించిన బాధితులు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేటలోని దుర్గాపురంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంఎల్ఎ సామినేని ఉదయభానుకు చెందిన భూమిలో ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఉదయభానుకు జగ్గయ్యపేట పట్టణం చిల్లకల్లు రోడ్డు ఆర్ఎస్ నెం 345లో 13.60 ఎకరాల స్థలం ఉంది. ఇటీవల ఎఫ్ లైన్‌కు దరఖాస్తు చేసుకోగా 24 మంది సుమారు 20 సెంట్లు ఆక్రమించినట్లు తేలింది. వారిని ఖాళీ చేయాలని ఉదయభాను కోరారు. దీంతో ఆక్రమణదారులు నెల రోజులు గడువు కావాలని కోరారు. అయితే గడువు ముగిసిన తర్వాత కూడా ఆక్రమణలు తొలగించలేదు. దీంతో ఉదయభాను స్వయంగా యంత్రాలను పంపి తొలగింపునకు శ్రీకారం చుట్టారు. దీనిని కొందరు తీవ్రంగా వ్యతిరేకించారు. 40 ఏళ్లుగా ఆ స్థలంలో తాము నివాసం ఉంటున్నామని. అప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడు ఎందుకని ప్రశ్నించారు. తొలగింపులో తమ మరుగుదొడ్లు, కొందరి బోర్లు పోతున్నాయని అభ్యంతరం తెలిపారు. అంతేగాక కౌన్సిలర్ వేదులాపూరి అలేఖ్య, ఎఎంసి మాజీ డైరెక్టర్ సైదాను ఆశ్రయించారు. సదా తదితరులు అక్కడికి చేరుకొని ఆక్రమణలు తొలగించవద్దని కోరారు. ఈలోగా జగ్గయ్యపేట పోలీసులు, తహశీల్దారు, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తదితరులు అక్కడికి చేరుకొని బాధితులతో మాట్లాడారు. ఆ స్థలాలకు సంబంధించి గతంలో ఉదయభాను తమకు బి ఫామ్ పట్టాలు ఇప్పించారని, ఇప్పుడు ఆయనే తనదని చెప్పటం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. అధికారులు వారితో చర్చలు జరిపి మరోసారి కొలతలు వేసి నిర్ధారణకు రావాలని, అప్పటివరకు ఆక్రమణలను తొలగించొద్దని సూచించడంతో తాత్కాలికంగా వివాదం సద్దుమణిగింది.

ప్రధాని పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

కలెక్టర్ బాలాజీ ఆదేశం



ప్రజాశక్తి - గన్నవరం : మే 2న ప్రధాని మోడీ పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేయాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శనివారం గన్నవరం విమానాశ్రయంలోని సమావేశ గదిలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్‌పి ఆర్.గంగాధర్ రావు, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మలతో కలిసి వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 2న ప్రధాని మోడీ అమరావతిలో రాజధాని నిర్మాణ పనులను పున: ప్రారంభిస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని గన్నవరం విమానాశ్రయానికి వస్తున్నారన్నారు. జిల్లా అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ఎలాంటి లోటు పాట్లు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రధానితోపాటు పలు రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు, కేంద్ర రాష్ట్ర మంత్రులు గన్నవరం విమానాశ్రయానికి రానున్నారన్నారు. జిల్లాలో వారు పర్యటించే ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రోటోకాల్ ప్రకారం గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడ కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా పర్యవేక్షించాలన్నారు. అన్ని నిర్దేశిత ప్రాంతాలలోనూ మంచినీటి ఏర్పాట్లు చేయాలన్నారు. కంట్రోల్ విభాగం అంతర్జాలం కనెక్షన్తో ఏర్పాటు చేసి పరిస్థితులను బట్టి ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు. అత్యంత ప్రముఖులు, ప్రముఖులు విమానాశ్రయానికి వస్తున్నందున విమానాలు బుక్ చేసుకున్న ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బంది కలగకుండా వీలైనంత తొందరగా ముందుగానే విమానాశ్రయం చేరుకునే విధంగా వారికి ఈమెయిల్ , వాట్సాప్ , ట్విట్టర్, ఎస్ఎంఎస్ ల ద్వారా సమాచారం అందజేయాలన్నారు. వచ్చే ప్రముఖులకు రవాణా, వసతి ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. బ్లూ పుస్తకం ప్రకారం తాత్కాలిక ప్రధానమంత్రి కార్యాలయ సెటప్‌ను ఎస్పీజీ వారు వచ్చాక వారితో చర్చించి ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా ఎస్‌పి ఆర్ గంగాధరరావు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు వారి తరపున ఎవరినైనా వివిధ పనుల కోసం నియమించుకుని ఉంటే వారి పూర్తి వివరాలు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో గుడివాడ ఆర్డిఓ బాలసుబ్రమణ్యం, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ శర్మిష్ఠ , రహదారులు భవనాల అధికారి లోకేష్, ఆర్టీవో శ్రీనివాసు, డీఎస్ఓ పార్వతి, డిఎఫ్ఓ సునీత, విమానాశ్రయం సహాయ మేనేజర్ శ్రీలేఖ, గన్నవరం డిఎస్పి శ్రీనివాసు తదితర అధికారులు పాల్గొన్నారు.

సిఎంకు ఎంపి శివనాథ్ జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి–విజయవాడ : దార్శనికుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని, భావితరాలకు మంచి భవిష్యత్తు అందిస్తారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఈనెల 20న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదినం సందర్భంగా ఆయనకు ఎంపి శివనాథ్ శనివారం ఒక ప్రకటనలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 సాధన కోసం, పీ4 విధానంతో సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించి పేదరిక నిర్మూలన చేయాలనే సంకల్పంతో కషి చేస్తున్న నిత్య కషివలుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి



మామిడి చెట్లు నరికి లారీలో తీసుకెళు తున్న దృశ్యం

రంగాపురం భూములపై కన్ను

6.74 ఎకరాల్లో వాగులు, డొంకలు, రోడ్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో యశోదరాదేవి పేరుతో అక్కడ సెంటు భూమి కూడా ఉండదు. కానీ 1986లో యశోదరాదేవి కుటుంబ సభ్యులు తమ పలుకుబడిని అడ్డుపెట్టుకొని అక్కడ 7.40 ఎకరాల భూమిని సబ్ డివిజన్ చేయించారు. సరిహద్దుదారులకు చెప్పకుండా, తాము విక్రయించిన భూమిని అనుభవిస్తున్న రైతులకు సమాచారం ఇవ్వకుండా, ఫీల్డ్‌లోకి రెవెన్యూ వారు వెళ్లి సర్వే చేయకుండా, పంచనామా లేకుండా ఈ వ్యవహారం నడిపి వివాదానికి తెర లేపారు. ఈ భూ వివాదానికి సంబంధించి బాధిత రైతులపై గౌతు శిరీష భర్త వెంకన్న చౌదరి తన పలుకుబడిని ఉపయోగించి అక్రమంగా ఏడు కేసులను బనాయించారు. అయితే ఈ కేసులను మైలవరం కోర్టు కొట్టివేసింది. రైతుల పక్షాన ప్రముఖ న్యాయవాదులు సుంకర రాజేంద్ర ప్రసాద్, రావూరి రమేష్ బాబు వాదించారు. అంతేగాక హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో హైకోర్టు ఈ భూమిని వివాదాస్పదమైనదిగా గుర్తిస్తూ రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం ఈ వ్యవహారం హైకోర్టు పరిధిలో ఉంది. కానీ కోర్టు ఆదేశాలను లెక్క చేయకుండా పలాస ఎంఎల్ఎ గౌతు శిరీష, ఆమె భర్త వెంకన్న చౌదరి అనుచరులు ఈనెల 9వ తేదీన వివాదాస్పద భూమిలోకి వచ్చి రైతులపై దౌర్జన్యానికి దిగారు. చట్ట విరుద్ధంగా వ్యవహరించి మామిడి చెట్లను నరికివేశారు. అయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

అధికార బలంతో మా మామిడి తోటలను నరికారు

బాధిత రైతులు కుప్పిరెడ్డి వెంకటరెడ్డి, గంధ్ర రామ తులశమ్మ, మద్దిరెడ్డి నాగేశ్వరరెడ్డి కుమారులు అంజిరెడ్డి, నర్సింహారెడ్డి

గత 50 ఏళ్లుగా ఈ భూమిని మేము సాగుచేసుకుంటున్నాం. మేము పెంచిన మామిడి చెట్లను అధికార పార్టీకి చెందిన పలాస ఎంఎల్ఎ గౌతు శిరీష తన అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఈనెల 9వ తేదీన దౌర్జన్యంగా నరికించారు. రెవెన్యూ, పోలీసు యంత్రాంగాన్ని బెదిరిస్తున్నారు. దీంతో అధికారులు సైతం ఎంఎల్ఎకు కొమ్ము కాస్తున్నారు. మేము పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నా



తమకు జరిగిన నష్టంపై మీడియాతో మాట్లాడుతున్న బాధిత రైతులు

కేసు తీసుకోవడంలేదు. కోర్టు తీర్పు కోసం ఎదురు చూడకుండా, ఎలాంటి అనుమతులు లేకుండా మామిడి చెట్లను నరకడం ఎంత వరకు సమంజసం? కష్టించి పెంచిన తోటలను నరికేస్తుంటే తట్టుకోలేక అడ్డుకున్నాం. పోలీసులు మమ్ములను, మా కుటుంబ సభ్యులైన వద్ధులను సైతం కనికరం లేకుండా స్టేషన్‌కు తరలించారు. మామిడి చెట్లను నరికి తమకు అన్యాయం చేశారు. అధికారులు రికార్డులు పరిశీలించి మాకు న్యాయం చేయాలి. .

7.40 ఎకరాల భూమి యశోదరాదేవి పేరుతో ఉంది

గౌతు కుటుంబ సభ్యులు

7.40 ఎకరాల భూమి గౌతు యశోదరాదేవి పేరుతో ఉంది. దీనికి సంబంధించిన రికార్డులు మా వద్ద ఉన్నాయి. మా భూమిలో ఉన్న మామిడి చెట్లను నరికే హక్కు మాకు ఉంటుంది.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలను అప్పగించండి

అధికారులను అభినందించారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ..ఎలక్ట్రానిక్ వ్యర్థాల వలన పని యొక్క సమస్యలు వస్తున్నాయని గుర్తించడం జరిగిందన్నారు. వాటిని పారవేస్తే భూమిలోకి వెళ్లడం వల్ల భూమి దెబ్బతింటుందన్నారు. ప్రజల ఆరోగ్యం కూడా ప్రమాదంలో పడుతుందని తెలిపారు. వాటిని శాస్త్రీయంగా డిస్పోజ్ చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అధికారులు గ్రామస్థాయిలో ప్రజలను చైతన్యపరచి పాడైపోయిన ఎలక్ట్రానిక్ పరికరాలను బయట పారవేయకుండా, పంచాయితీకి అప్పగించేలా చూడాలన్నారు. పాడైన టీవీలు, చార్జర్లు, ఫోన్లు, బట్టల మిషన్లు ఇలాంటి వస్తువులన్నీ సేకరణ కోసం పంచాయతీలో ప్రత్యేకంగా సెంటర్ ను అందుబాటులోకి తెచ్చామన్నారు. అనంతరం పాడైన ఎలక్ట్రానిక్ వస్తువులతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్లో పరిశీలించారు. అనంతరం ప్రజలతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, డిపిఓ అరుణ, ఇన్చార్జ్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, బుద్ధవరం సర్పంచ్ బడుగు బాలమ్మ, ఎంపీడీవో స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శి సరోజిని, తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని సక్సెస్ ఫుల్ గా నిర్వహించినందుకు డిపిఓ అరుణకు అవార్డు ఇచ్చారు.

సర్దార్ గౌతు లచ్చన్నకు ఘన నివాళి




మచిలీపట్నంలో నివాళులర్పిస్తున్న కూటమి నాయకులు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : సర్దార్ గౌతు లచ్చన్న 19వ వర్ధంతి సందర్భంగా మచిలీపట్నం బస్టాండ్ సెంటర్ వద్ద స్వర్గీయ సర్దార్ గౌతు లచ్చన్న కాంస్య విగ్రహానికి మాజీ ఎంపీ, ఏపీఎస్ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు ఆధ్వర్యంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన నారాయణరావు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ఎంతో కషి చేసిన మహనీయు డన్నారు. జమీందారీ వర్గాల వ్యతిరేక పోరాట వీరునిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ళ బుల్లయ్య ,జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు బండ్రెడ్డి రాము , బండి రామకష్ణ , ,టీడీపీ నాయకులు మోటమరి బాబాప్రసాద్ ,గోపు సత్యనారాయణ ,బత్తిన దాసు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** మండలంలోని రొయ్యూరులో శనివారం సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి వేడుక ఘనంగా జరిగింది. 19వ వర్ధంతి సందర్భంగా నాయకులు రొయ్యూరులో గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిదులు గా రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి పాల్గొని మాట్లాడారు. మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి లుక్కా రేణుకారావు,మాజీ తెలుగు యువత జిల్లా అధ్యక్షులు రామినేని కుటుంబావు,టీడీపీ నాయకులు చింతపల్లి వెంకటేశ్వరావు, బొడ్డపాడు సర్పంచ్ మూడే శివ శంకర్ పాల్గొన్నారు.**ప్రజాశక్తి మొవ్వ :** మండలపరిధిలోని కాజ గ్రామంలో గౌతు లచ్చన్న వర్ధంతి వేడుకలు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ

కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్, కష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర స్థాయి నాయకులు కొనకళ్ళ జగన్నాథరావు (బఃల్లయ్యా), మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష కార్యదర్శులు లింగమనేని రామలింగేశ్వరరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** రాజీకీయ విలువలకు నిలువెత్తు నిదర్శనం సర్దార్ గౌతులచ్చన్న అని పలువురు కీర్తించారు. లచ్చన్న 19వ వర్ధంతి పురస్కరించుకుని స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు గుర్నాధరావు, లచ్చన్న సేవాసమితి అధ్యక్షుడు కాగిత కొండ, టీడీపీ నాయకులు పామర్తి శివ, సుబ్బారావు, కుటుంబరావు, సంజయ్, నాగరాజు తది తరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** గౌత లచ్చన్న 19వ వర్ధంతిని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం గౌత లచ్చన్న చిత్రపటానికి ఎమ్మెల్యే




అవనిగడ్డలో...



గుడివాడలో...

బుద్ధ ప్రసాద్, నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రాం పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు, బావ దేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, మాజీ వైస్ ఎంపీపీ లుక్క వెంకట పిచ్చయ్య, బీసీ నాయకులు చెన్ను గాంధీ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** బీసీల అభ్యున్నతికి కషి చేసిన మహోన్నత నాయకుడు గౌతు లచ్చన్న అని ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. శనివారం కీర్తిశేషులు గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా స్థానిక కాకర్ల వీధిలోని గౌతు లచ్చన్న విగ్రహానికి యలవర్తి శ్రీనివాస రావు నివాళులర్పించారు. టిడిపి సీనియర్ నాయకులు జగన్ మోహన్ రావు, వెనిగండ్ల రామకష్ణ, దింట్యాల రాంబాబు, ఏరియా ఆసుపత్రి కమిటీ సభ్యులు మరీదు రోహిణి కుమారి, శొంఠి అయ్యప్ప, పాల్గొన్నారు.

పెదఓగిరాలలో చోరీ



డాగ్ స్క్వాడ్‌తో ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఉయ్యూరు : మండలంలోని పెదఓగిరాల గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన చోరీలో 15 లక్షల నగదు 10 కాసుల బంగారాన్ని దొంగలు దోచుకున్నారు. రూరల్ పోలీసులు కథనం ప్రకారం గ్రామానికి చెందిన మర్రెడ్డి మాధవి స్థలం రిజిస్ట్రేషన్ నిమిత్తం 15 లక్షల నగదులు తీసుకొచ్చి ఇంట్లో బీరువాలో ఉంచి, రాత్రిపూట ఆరు బయట నిద్రిస్తుండగా బీరువా పగలగొట్టి చోరీ చేశారు. దీంతోపాటు 10 కాసుల బంగారం కూడా చోరీ గుర్రైనట్లు తెలిపారు. అలాగే పక్క ఇంట్లోని ద్విచక్ర వాహనం కూడా చోరీ గుర్రైంది. డాగ్ స్క్వాడ్ క్లూస్ టీమ్ లు శనివారం సంఘటన స్థలాన్ని పరిశీలించాయి. గన్నవరం డిఎస్పి చలసాని శ్రీనివాస్, సిఐ మురళీకష్ణ తో పాటు పలువురు పోలీసు అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి దర్యాప్తు చేస్తున్నారు.



వాగులు ఉన్న చెత్త చెదారం చూపిస్తున్న రైతులు

చీమలవాగులో చెత్తాచెదారం తొలగించాలి

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలంలో చీమల వాగులో దగంగా పెరిగిన తుమ్మ పొదలను తొలగించాలని ఏపీ రైతు సంఘం నాయకులు నల్లూరి ధర్మారావు డిమాండ్ చేశారు. శనివారం చిక్కవరం గ్రామంలో చీమల వాగును రైతు సంఘం నాయకులు పరిశీలించారు. చెక్కవరం నుంచి కేసరపల్లి వరకు చీమల వాగు గట్లపై దట్టంగా తుమ్మలు మొలిచాయని, చెత్త చెదారం పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డుపడుతుందని రైతులు తెలిపారు. వరద సమయంలో చిక్కవరం ఏరియాలో నీరు ఎగదన్ని చీమల వాగు కట్ట కోతకు గుర్రైందని, పోలవరం కాలవ గట్టు కూడా కోతకు గుర్రైనట్లు రైతులు చెప్పారు. కాలువలు పూడిక తీయాల్సిన అవసరం కూడా ఉందన్నారు. ఈ సందర్భంగా ధర్మా రావు మాట్లాడుతూ చీమల వాగుపై తుమ్మలను ముళ్ల పొదలను తొలగించాలని కోరారు. రైతు నాయకులు కె. వెంకటేశ్వరరావు, కొలుసు శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవా భవనంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర చికిత్స శిబిరాన్ని శనివారం నిర్వహించారు. కొల్లి రాజేష్ ఆర్థిక సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 30 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 7 గురుకి కేటరాక్ట్, 4 గురికి కంటిపొరలకు సర్జరీ చేయవలసిన అవసరం ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు శశికళ , లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వైపిసి ప్రసాద్, నైస్ క్లబ్ సభ్యులు జంగం మోహన రావు,జి చంద్రశేఖర్, ఎం పెరుమాళ్ళు పాల్గొన్నారు.

పిజి డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కష్ణా) : భారత క్రీడా ప్రాధికార సంస్థ డిప్యూటీ డైరెక్టర్, ఎన్ఎస్ఎన్ఐఎస్ పటియాలా వారు 2025-26 అకడమిక్ కోసం ఏంఎస్సీ. స్పోర్ట్స్ కోచింగ్ 2025-27, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులు 2025-26, అకడమిక్ సెషన్-2025-27 సంబంధించి స్పెషలైజేషన్లో ప్రవేశం కొరకు ఆన్లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివద్ధి అధికారి కె.ఝాన్సీలక్ష్మి తెలిపారు. ఆసక్తి గల వారు సంబంధిత ధ్రువపత్రాలతో మే 2వ తేదీలోగా వెబ్ సైట్: https://www.ssc.nsnis.in దరఖాస్తు చేసుకోవాలన్నారు.



అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు వివరిస్తున్న సిబ్బంది

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - గుడివాడ : సరైన అవగాహనతో అగ్ని ప్రమాదాలు నివారించడంతో పాటు ప్రమాద తీవ్రతను సైతం తగ్గించవచ్చని సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి (ఏడిపిఓ) జె. అంజనేయులు అన్నారు. స్థానిక అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాలు 6వ రోజు సందర్భంగా హాస్పటల్స్‌లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించుటలో భాగంగా గుడివాడలోని ఏరియా ప్రభుత్వ హాస్పిటల్, ప్రైవేట్ హాస్పిటల్‌లో అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాల నివారణ పై అవగాహన నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ క్రమంలో సి.ఎం.ఆర్. షాపింగ్ మాల్స్‌లో సిబ్బందికి అగ్నిప్రమాదాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.

ఉచిత రక్తపరీక్ష శిబిరం : అగ్నిమాపక వారోత్సవాలు 6వ రోజు సందర్భంగా గుడివాడ అగ్నిమాపక కేంద్రం నందు స్టార్ ఫార్మసీ వారి స్టార్ డయాగ్నోస్టిక్స్ ఆధ్వర్యంలో ఉచిత రక్త పరీక్ష శిబిరం ఏర్పాటు చేసినట్లు స్టార్ ఫార్మసీ అధినేత డాక్టర్ డిఎన్వి శివరామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టార్ ఫార్మసి సిబ్బంది పాల్గొన్నారు.

డిఎస్‌సి ఆన్‌లైన్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణాజిల్లాలో గల బి.సి. ఈ.డబ్ల్యు. యస్. (ఇ.బి.సి.), ఎస్.సి. ఎస్.టి. కులములకు చెంది డి.యస్.సి -2025 రిక్రూట్ మెంట్ పరీక్షలకు ఆన్లైన్లో ఉచిత శిక్షణ పొందుటకు టెట్ పరీక్షలలో అర్హత పొందిన అభ్యర్థుల నుండి దరఖాస్తు లను కోరుతున్నట్లు జిల్లా వెనుబడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారి జి.రమేష్ తెలిపారు. క్రష్ణ జిల్లాకు 200 మంది అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చుటకు అవకాశం ప్రభుత్వం కల్పించిందని, ఇప్పటి వరకు మొత్తం 44 ధరఖాస్తులను స్వీకరించామన్నారు. కాబట్టి .మరొక సారి అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకొనుటకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.. ధరఖాస్తు చేసుకోను అభ్యర్థులు కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, నేటివిటీ సర్టిఫికేట్, పరీక్షలో అర్హత సాధించిన ధ్రువ పత్రములు సమర్పించాలన్నారు. టెట్ పరీక్షలలో అర్హత కలిగి డి.యస్.సి -2025 రిక్రూట్ మెంట్ పరీక్షలకు ఆన్లైన్లో ఉచిత శిక్షణ పొందగోరు అభ్యర్థులు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారి, కృష్ణాజిల్లా, మచిలీపట్నం వారి కార్యాలయము నందు దరఖాస్తులను పొందవచ్చన్నారు. దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులకు ఆన్లైన్ ద్వారా కోచింగ్ ఇస్తామని, కోచింగ్ ప్రారంభించు తేది, కోచింగ్ వ్యవధి మొదలైన వివరాలు తర్వాత తెలియజేస్తామన్నారు.

ట్రై సైకిళ్లు, ఉపకరణాలు పంపిణీ

ప్రజాశక్తి - గుడివాడ : విద్యాశాఖ, సర్వ శిక్ష కష్ణాజిల్లా ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరతలు కలిగిన విద్యార్థులకు గుడివాడ ఏ.జీ.కే పాఠశాలలో ఉపకరణాల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న టిడిపి పట్టణ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, టిడిపి నాయకులు వెనిగండ్ల రామకష్ణలు అధికారులతో కలిసి విద్యార్థులకు ట్రై సైకిల్స్, ఉపకరణాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీ, ఎజికే పాఠశాల ప్రిన్సిపాల్ నరసమాంబ, సర్వ శిక్ష అభియాన్ అధికారులు, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

గుడివాడలో 'రన్ ఫర్ జీసస్'

ప్రజాశక్తి - గుడివాడ : ఈస్టర్ పర్వదినం సందర్భంగా గుడివాడ దైవ సేవకులు, విశ్వాసులు, యౌవనస్థులు కలిసి ఘనంగా రన్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్.సి.యం చర్చి వద్ద బిషప్ అప్పికట్ల జాషువా, బ్రదర్ జి.ఏ.శేఖర్, పాస్టర్ యేహేజ్కేలు ప్రార్దనలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫుల్ గాస్పెల్ చర్చి ముగింపు సభలో బిషప్ అప్పికట్ల జాషువా, బ్రదర్ జి.ఏ.శేఖర్, న్యాయవాది చిలుకోటి రాజేంద్ర ప్రసాద్, కన్వీనర్ జి.శ్యాంబాబు తదితరులు మాట్లాడారు. పాస్టర్స్ కరుణకుమార్, సత్యం, ఎలీషా, స్టాన్లీ, ప్రభు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉషారామాలో ప్రాజెక్ట్ ఎక్స్‌పో



ప్రజాశక్తి-ఉంగుటూరు : బీటెక్ ఎలక్ట్రానిక్స్ విద్యార్థులు ప్రాజెక్ట్ ఎక్స్‌పోను విజయవంతంగా నిర్వహించారని ఉషా రామా ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి వి ఎస్ వి ప్రసాద్ అన్నారు. శనివారం కళాశాలలో ఇఇఇ బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ప్రాజెక్ట్ ఎక్స్పోను నిర్వహించారు. ఈ ఎక్స్పోలో విద్యార్థుల రూపొందించిన అనేక ప్రయోగాత్మక, ఆవిష్కరణలను ప్రాజెక్టు ద్వారా ప్రదర్శించారు. అని విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఉండటంతో అభినందనలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-బంటుమిల్లి : ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో భాగంగా మండలంలోని పెందూరు గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పర్యటించి కూలీలతో మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని నాయకులు ఎల్ అజయ్‌ఘోష్ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు కూలీ రేట్లు పెంచాలని, కనీస వేతనం 600 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు మాజేటి శివ శ్రీనివాసరావు ఉపాధి కార్మికుల సమస్యలపై మే 5వ తారీఖున కలెక్టర్ కార్యాలయం దగ్గర నిరసనలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, కృష్ణ, శ్యాము రాంబాబు పాల్గొన్నారు.



శ్రీ చైతన్య విజయకేతనం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : జె ఈ ఈ మెయిన్స్ - 2025 ఫలితాలలో శ్రీ చైతన్య విజయవాడ క్యాంపస్ విద్యార్థులకు ఓపెన్ కేటగిరీలో ఆలిండియా ర్యాంకులు సాధించారని శ్రీ చైతన్య విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ ఎజిఎం మద్దినేని మురళీ కృష్ణ తెలిపారు. నగరంలోని శ్రీ చైతన్య జె ఈ ఈ క్యాంపస్ నందు శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ కేటగిరీలో 10 లోపు 1, 1, 9, 10 నాలుగు ర్యాంకులు శ్రీ చైతన్య విద్యా సంస్థల విద్యార్థులు సాధించారని అన్నారు. శ్రీ చైతన్య విజయవాడ క్యాంపస్ విద్యార్థులు పి.హెచ్.ఎస్. ఎస్.కార్తీక్, పి.ప్రణయ సాయి ముకేష్, ఈశ్వర్ కార్తీక్ 100 లోపు మూడు ర్యాంకులు సాధించారని తెలిపారు. అలాగే ఆలిండియా ఓపెన్ కేటగిరీ నందు 500 లోపు 24 మంది, ఆలిండియా 1000 ర్యాంకు లోపు 41 మంది విద్యార్థులు సాధించారని అన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - భవానీపురం : డిఎస్‌సిఎం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సేవ చేయాలన్న తలంపుతో రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ పలు కార్యక్రమాలను చేపట్టింది. దాన్లో భాగంగా విద్యాధరపురం దళవాయి సుబ్బరామయ్య నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 500 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గత నెలలో పాఠశాల విద్యార్థులందరికీ మ్యాక్సీవిజన్ వారి సహకారంతో విద్యార్థులందరికీ ఉచితంగా నేత్ర వైద్య పరీక్షలు చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ నగర అధ్యక్షులు డాక్టర్ వి.శ్రీదేవి పాఠశాలలో విద్యార్థులకు కళ్ళజోళ్ళు అందించారు. విద్యార్థులకు మ్యాక్సీవిజన్ సహకారంతో రోటరీ క్లబ్ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించిందని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాతంగి కోటయ్య మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు డివి.మురళి ప్రసాద్, రోటరీ సభ్యులు, మ్యాక్సీవిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

విజయవాడ వాసికి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విజయవాడ పటమట ప్రాంతానికి చెందిన నూకతోటి రంజిత్ కుమార్‌కు శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. రంజిత్ కుమార్ శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగం ఆచార్యులు వి.శ్రీకాంత్ రెడ్డి పర్యవేక్షణలో 'మధ్యస్థ వయస్సులో, వృద్ధాప్యంలో వున్న ప్రజలకు ఒత్తిడి, ఆందోళన, నిరాశపై విపాశాన ధ్యానం వల్ల మానసిక శ్రేయస్సు ప్రభావం 'అనే అంశంపై పరిశోధన చేశారు. ఆయన సమర్పించిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేశారు.



రంజిత్ కుమార్ విజయవాడ స్పార్క్ సైకాలజీ కౌన్సిలింగ్ సెంటర్‌లో సేవలు అందిస్తున్నారు. పిహెచ్‌డి పూర్తి చేసి డాక్టరేట్ పొందిన సందర్భంగా రంజిత్ కుమార్‌ను సైకాలజిస్ట్ డాక్టర్ రమేష్, సైకాజీ విభాగం సిబ్బంది, బంధుమిత్రులు అభినందించారు.

అటవీ ప్రాంతంలో వృద్ధుడి మృతదేహం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు మండలం, లక్ష్మీపురం అటవీ ప్రాంతంలో ఒక చెట్టుకు వేలాడుతున్న తప్పిపోయిన వృద్ధుడి మృతదేహాన్ని శనివారం గుర్తించిన పశువుల కాపరులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీనిపై ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిట్టేల గ్రామానికి చెందిన పెరుమల్ల ఆశీర్వాదం(72) తప్పిపోయినట్లు ఈ నెల 8న కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. అడవిలో ఒక చెట్టుకు లుంగీతో వేలాడుతున్న మృతదేహం విషయం కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా అశ్వీరాదంగా గుర్తించారని ఎస్ఐ తెలిపారు. తప్పిపోయిన రోజే చెట్టుకు ఉరి వేసుకుని చనిపోయి ఉండవచ్చని, అయితే ఆత్మహత్యా, హత్యా అనేదానిపై విచారణ జరుపుతున్నామని ఎస్ఐ చెప్పారు. మృతదేహం కుళ్లిపోయి అస్థిపంజరంలా ఉండటంతో అడవిలోనే పంచనామా చేసి ఖననం చేయనున్నట్లు పోలిసులు తెలిపారు.

జెఇఇలో శారద విద్యాసంస్థల ప్రతిభ



దేవి శ్రీ ప్రియ | ఎమ్.జయపాల్ | నాగచరణ్ | రాజేష్ నాగసాయి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : జెఈఈ మెయిన్స్ 2025 ఫలితాలలో మొగల్రాజపురంలోని శారద విద్యా సంస్థలు విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వై.శారద దేవి తెలిపారు. మొగల్రాజపురంలోని సంస్థ కార్యాలయంలో శనివారం ఉదయం అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఎమ్.జయపాల్ 56వ ర్యాంకు, సి.రాజేష్ నాగసాయి 515వ ర్యాంకు, ఏ.దేవి శ్రీ ప్రియ 1783 ర్యాంకు, జి.హరీష్ రాజు 2024 ర్యాంకు, యన్.వి.నాగచరణ్ 9,693 ర్యాంకులు సాధించారని అన్నారు. తమ కళాశాల డే స్కాలర్ విద్యార్థులు తోనే అత్యుత్తమ ఫలితాలు సాధించారని అన్నారు. తమ కళాశాల నుండి 650 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 350 మంది విద్యార్థులకు మంచి ర్యాంకులు సాధించారని అన్నారు. తమ కళాశాలలో చక్కని ప్రణాళికతో పాటు, మారుతున్న పాఠ్యాంశాలను అనుగుణంగా అనుభవజ్ఞులైన అధ్యాపకులతో అత్యుత్తమ శిక్షణ అందిస్తున్నామని అన్నారు. విద్యార్థులకు వారంతపు, మాసంతపు పరీక్షలను నిర్వహించి విద్యార్థులకు సందేహాలను నివృత్తి చేస్తున్నామని అందుకే అద్భుత ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అడ్వైజర్ ఈ.ఎస్.ఆర్ కె.ప్రసాద్, జనరల్ మేనేజర్ జి.వి.రావు విద్యార్థులను అభినందించారు.

కెవిఆర్ విద్యార్థికి జెఇఇలో జాతీయ స్థాయిలో 4వ ర్యాంక్

విజయవాడ : జేఈఈ మెయిన్స్ 2025 ఫలితాలలో కెవిఆర్ జూనియర్ కాలేజి విద్యార్థి పి.నవదీప్ జాతీయస్థాయిలో నాలుగో ర్యాంక్ సాధించాడు. ఈ ఘనత సాధించిన నవదీప్‌ను కళాశాల చైర్మన్ కె.వెంకటేశ్వరరావు, కాలేజి డీన్ అనూష, ప్రిన్సిపల్ వెంకట్ దుర్గారావు ప్రత్యేకంగా అభినందించారు. జాతీయస్థాయిలో ర్యాంకులు వచ్చేలా కషి చేసిన సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ టి అనూష మాట్లాడుతూ పి.నవదీప్‌కు జాతీయస్థాయిలో మంచి మార్కులు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇందుకు కషి చేసిన కళాశాల అధ్యాపకులకు, నవదీప్ తల్లిదండ్రులకు ఆమె అభినం దనలు తెలియజేశారు.



ఉల్లాసంగా రన్ ఫర్ జీసస్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సిలువ మరణం ద్వారా పునరుత్థానుడైన యేసుక్రీస్తు సందేశం సమస్త మానవాళికి శాంతి సందేశం కావాలని విజయవాడ కేథలిక్ డయోసిస్ బిషప్ మోస్ట్ రెవ.బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, కృష్ణా, గోదావరి డయోసిస్ సియస్ఐ బిషప్ టి.జార్జికొర్నేలియస్ పిలుపునిచ్చారు. ఈస్టర్ (పాస్కా) సందర్భంగా ఏపీ ఫెడరేషన్ ఆఫ్ తెలుగు చర్చెస్, నగర అన్ని క్రైస్తవ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం 6 గంటలకు ఆర్సీయం బిషప్ జోసఫ్ రాజారావు, మోన్సిన్యోర్ రెవ. ఫాదర్ మువ్వల ప్రసాద్, సియస్ఐ బిషప్ కొర్నేలియస్, బేతేలు మినిస్ట్రీస్, బైబిల్ కాలేజి ప్రెసిడెంట్ అండ్ డైరెక్టర్ రెవ. పాస్టర్ సల్లూరి జయకుమార్ బాబు, రెవ.పాస్టర్ అల్లూరి విశ్వప్రసాద్ కన్వీనర్ ప్రవీణ్ శీలం పునరుత్థానుడైన క్రీస్తును స్వాగతిస్తూ కాగడాలు వెలిగించి ఆనందోత్సాహాల మధ్య రన్ ఫర్ జీసస్ శాంతి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా బిషప్లు రాజారావు, కొర్నేలియస్, మోన్సిన్యోర్ రెవ. ఫాదర్ మువ్వల ప్రసాద్, ప్రెసిడెంట్ అండ్ డైరెక్టర్ రెవ. పాస్టర్ ఎస్. జయకుమార్ బాబు మాట్లాడుతూ క్రైస్తవ విశ్వాసుల ఐక్యతను చాటి చెప్పేందుకు రన్ ఫర్ జీసెస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు బెంజిసర్కిల్ సమీపంలోని సెయింట్ పాల్స్



కథెడ్రల్ చర్చి) ప్రాంగణం నుండి వేలాదిమంది క్రైస్తవులతో ప్రారంభమైన రన్ ఫర్ జీసెస్ శాంతి ర్యాలీ పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డు సిద్ధార్థ కాలేజి మదర్ థెరిస్సా సర్కిల్ మీదుగా శిఖామణి సెంటర్ నుండి స్టేట్ గెస్ట్ హౌస్ సమీపంలోని సెయింట్ పాల్స్ బసిలికా సియస్ఐ చర్చి ప్రాంగణానికి చేరుకొంది. ఈ కార్యక్రమంలో 'రన్ ఫర్ జీసెస్' స్టేట్ కో-ఆర్డినేటర్ రెవ.పాస్టర్ బెల్లంకొండ శివాజీరాజు, కన్వీనర్ రెవ.పాస్టర్ ప్రవీణ్ శీలం, ఫెడరేషన్ ఆఫ్ తెలుగు చర్చెస్ ప్రతినిధులు ఫాదర్ యం. మువ్వల ప్రసాద్, డైరెక్టర్ పాస్టర్ ఎస్.జయకుమార్ బాబు, పాస్టర్ అల్లూరి విశ్వప్రసాద్, పాస్టర్ ఐ. కరుణానిధి, మాజీ డిప్యూటీ మేయర్ ఎస్. గ్రిటన్, కోరుకొండ అశోక్ కుమార్, పాస్టర్ బి.ఫిలోమిన్ స్వర్ణ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండల పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పండుగ సందర్భంగా శనివారం ఉదయం క్రీస్తు పునరుద్దాన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ నుండి ఫెర్రీ ఆల్ఫా సెంటర్, ఏ కాలనీ తదితర ప్రాంతాల గుండా నిర్వహించారు. గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ పాస్టర్ మోగులూరు ఎలీషా మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత భయంకరమైన కిరాతకమైన సిలువ మరణాన్ని ఏసుక్రీస్తు పొందాడని, సర్వ మానవుల పాప పరిహారార్థమై మనుషులు అందరి పాపమును తనమీద వేసుకుని, పరిశుద్ధతను మనకు ఇచ్చాడని అన్నారు. పాపము వలన మనము పొందవలసిన శిక్షను ఆయన సిలువలో భరించాడని, చనిపోయి మూడో దినమున తిరిగి లేస్తానని తాను చెప్పినట్లే తిరిగి పునరుద్దానుడయ్యాడని, అన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు సుబ్బారావు ఉపాధ్యక్షులు స్టీవెన్, సెక్రటరీ ఇస్సాకు, జాయింట్ సెక్రెటరీ సా సాల్మన్ కోశాధికారి సుభాకర్ రావు, ప్రసన్న, సామ్యూల్ షేక్ జాన్, ఇమ్మానుయేల్, ఇస్మాయిల్, అబ్రహాం, రాజేంద్ర ప్రసాద్, ఇతర పాస్టర్లు, వందలాదిమంది క్రైస్తవ సోదర సోదరీమణులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా అమరావతి జర్నలిస్టు క్రికెట్ లీగ్ టోర్నీ

నేడు ఫైనల్ పోరు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మూలపాడు ఎసిఎ క్రికెట్ గ్రౌండ్ లో అమరావతి జర్నలిస్టు క్రికెట్ లీగ్ పోటీలు ఉత్సాహం గా సాగుతున్నాయి. వత్తి రీత్యా నిత్యం బిజీగా ఉండే జర్నలిస్టు లు బ్యాటింగ్ లో, బౌలింగ్‌లోనూ సత్తా చాటడం విశేషం. తొలిరోజు టోర్నీని ఎంపి కేశినేని శివనాథ్ చిన్ని, శాప్ చైర్మన్ రవినాయుడు ప్రారంభించారు. ఇక రెండో రోజు జరిగిన మ్యాచ్ లు హోరాహోరీగా సాగాయి. ఉదయం జరిగిన మ్యాచ్ లో ప్రింట్ మీడియా జట్టు పై రాయుడు మీడియా జట్టు ఓటమి చెందింది. మధ్యాహ్నం జరిగిన రెండు సెమీ ఫైనల్ మ్యాచ్ ల్లో అమరావతి మీడియా జట్టు, రాజధాని మీడియా జట్టు విజయం సాధించి ఫైనల్ కి చేరాయి.



చీరలు, పండ్లు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ బొండా

ఘనంగా ముఖ్యమంత్రి జన్మన వేడుకలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గవర్నర్ పేటలో జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు గోర్తి శ్రీనివాస చక్రవర్తి ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు తొలుత సిఎం చంద్రబాబు నాయుడుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ మహిళలతో కలిసి కేకును కట్ చేశారు. అనంతరం చీరలు, పండ్లు పంపిణీ చేశారు. బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ దార్శనికుడు, మంచి విజన్ ఉన్న నాయకుడు నారా చంద్రబాబునాయుడు అన్నారు. విద్యార్థి నాయకుడిగా రాజకీయాలలోకి ప్రవేశించి ఆంధ్ర రాష్ట్రానికి సుదీర్ఘకాలం ముఖ్యమంత్రి చేసిన నాయకుడు చంద్రబాబు అన్నారు. టీడీపి జిల్లా ఉపాధ్యక్షుడు గోర్తి శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం నవ్యాంధ్రప్రదేశ్ రూపకల్పనలో చంద్రబాబు నాయుడు పాత్ర చిరస్మరణీయ మన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు డాక్టర్ విశ్వనాథ్,రవనమ్మ, జానకి, బాబూరావు , హేమ సుందర్ పాల్గొన్నారు.



వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి - గంపలగూడెం : వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ బోర్డు ఆధ్వర్యంలో గంపలగూడెం మండల వ్యాప్తంగా ఉన్న ముస్లింలు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. తోటమూల నుండి గాంధీ సెంటర్ వరకు భారీ సంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు అనంతరం తహశీల్దార్ వడ్డేస్ వరకు రాజకుమార్‌కి సంబంధిత వివరాలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ముస్లిం పెద్దలు మాట్లాడుతూ, కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులు మద్దిరెడ్డి వెంకటరెడ్డి, షేక్ నాగుల్ మీరా సంఘీభావం తెలిపారు.

ఉరేసుకొని విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - వత్సవాయి : ఉరేసుకొని విద్యార్థిని మృతి చెందిన సంఘటన మండలంలోని మంగోలులో చోటు చేసుకుంది. ఏలూరు రాగ శ్రీ (15) జగ్గయ్యపేటలో శ్రీ మేధా స్కూల్ లో 9వ తరగతి చదువుతున్నది. ఆ పాఠశాల బస్సుకి వెళ్తూ వస్తుంది. శుక్రవారం రాత్రి తల్లిదండ్రులు బయట వరండాలో పడుకోగా ఆమె ఇంట్లో పడుకుంది. గొంతులో టాన్సిల్స్ కావడంతో ఆ నొప్పికి తట్టుకోలేక ఉరేసుకొని మృతి చెందిందని కుటుంబీకులు తెలుపు తున్నారు. వత్సవాయి ఎస్ఐ ఉమా మహేశ్వర రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

సెకండరీ గ్రేడ్ టీచర్లను కేటాయించాలని వినతి


ప్రజాశక్తి కలెక్టరేట్ (కృష్ణా) : ఉన్నత పాఠశాలల మాదిరిగానే ఫౌండేషన్ పాఠశాలలు, బేసిక్ ప్రాథమిక పాఠశాలలకు కూడా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల కేటాయింపు జరగాలని కోరుతూ యుటిఎఫ్ కృష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా విద్యాశాఖాధికారి పి వి జె రామారావుకి వినతి పత్రం అందజేశారు. పాఠశాల విద్యలో ఉపాధ్యాయ పోస్టుల హేతుబద్ధీకరణ ప్రతిపాదనలు హైస్కూలులోని ప్రాథమిక తరగతుల 1 నుండి 5 తరగతుల వరకు ప్రతిపాదనలు మాదిరిగా వుండాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణకు విద్యాశాఖ ప్రాథమికంగా మార్గదర్శకాలను రూపొందించింది. ఈ మార్గదర్శకాలు ప్రాథమిక పాఠశాల వ్యవస్థకు, విద్యార్థులకు తీరనినష్టాన్ని కలుగచేసే విధంగా వున్నాయన్నారు విద్యాశాఖ ప్రవేశపెడుతున్న నూతన విధానాలు విద్యారంగానికి, మేలు చేసేవిధంగా వుండాలన్నారు. ఉన్నత పాఠశాలలోని బేసిక్ ప్రాథమిక పాఠశాలకు 10 మంది విద్యార్థులకు ఇద్దరు ఎస్.జి.టి.లను, 11-30 మంది విద్యార్థులకు 3 గురు ఎస్.జి.టి.లను, 31-40 విద్యార్థులకు 4గురు ఎస్.జి.టి.లను, 40 కన్నా ఎక్కువ మంది విద్యార్థులకు 5 గురు ఎస్.జి.టి.లను కేటాయించారన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే దాదాపు 12 వేల ఏకోపాధ్యాయ పాఠశాలలు



డిఇఒకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

యు నాయని,ఫౌండేషన్ స్కూల్స్ పేరుతో కేవలం 1, 2 తరగతులతో నిర్వహించడం వలన ఏకోపాధ్యాయ పాఠశాలలు సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. మరి ఒక టీచరుతో నాణ్యమైన విద్యను అందించటం కష్టతరమౌతుందన్నారు. ప్రతి ఫౌండేషన్ స్కూలు, బేసిక్ ప్రాథమిక పాఠశాలలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు వుండేలా మార్గదర్శకాలు రూపొందించాలని ప్రాథమిక విద్యావ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె ఎ ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు ఎండి షౌకత్ హుస్సేన్, బి కనకారావు, జిల్లా గౌరవాధ్యక్షులు జె లెనిన్ బాబు, సహాధ్యక్షురాలు జె ఝాన్సీ, జిల్లా కార్యదర్శి రాజా శ్రీధర్,జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ ఎన్ శ్రీకాంత్, జిల్లా కార్యవర్గ సభ్యులు పిరవి వరప్రసాద్, కె రంగనాథ్ వివిధ మండల శాఖ బాధ్యులు ఉన్నారు.

ఎస్ఎస్ఆర్ కాలేజీలో పిజి సెట్ హెల్ప్‌లైన్ కేంద్రం



ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో పిజి అడ్మిషన్ల పెంచే లక్ష్యంతో మచిలీపట్నం ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో పిజి సెట్ హెల్ప్ లైన్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డా. ఎల్ సుశీల తెలిపారు. పిజి సెట్ కు దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సౌలభ్యం కోసం, వారి అనుమానాల నివృత్తి కోసం ఈ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలలో అమలు చేస్తున్న కోర్సులపై సాధ్యమైనంత ఎక్కువ మంది విద్యార్థులకు అవగాహన కల్పించడం ఈ కేంద్రం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మచిలీపట్నం పరిసర ప్రాంత విద్యార్థులు కృష్ణా విశ్వవిద్యాలయం వరకు రాకుండా పట్టణ పరిధిలోనే వివరాలు పొందవచ్చని తెలియజేసారు. హెల్ప్ లైన్ కేంద్రంలో విశ్వవిద్యాలయం కు చెందిన అధ్యాపకులు అందుబాటు లో ఉంటారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఒక ప్రకటనలో తెలిపారు.

22 న కెయులో ప్రాంగణ ఎంపికలు

ఈ నెల 22వ తేదీన కృష్ణా విశ్వవిద్యాలయం లో ప్రాంగణ ఎంపికలు నిర్వహించనున్నట్లు కృష్ణా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె రాంజీ తెలిపారు.హైదరాబాద్ కు చెందిన ప్రఖ్యాత హెటిరో డ్రగ్స్ కంపెనీ అధికారులు ఈ ప్రాంగణ ఎంపికలు ద్వారా ఉద్యోగ అవకాశం కల్పించనున్నారు. బి ఫార్మసీ, రసాయన శాస్త్ర విభాగ విద్యార్థులు ప్రాంగణ ఎంపికలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉపకులపతి కోరారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

బుడమేరు ముంపు నివారణకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-నందివాడ : బుడమేరు ముంపు నివారణకు తక్షణమే చర్యలు చేపట్టాలని రైతుసంఘం సీనియర్ నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఒద్దులమెరక రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ 2024 సార్వా సీజన్లో అధిక వర్షాలు కురవడంతో బుడమేరు ముంపు వలన డెల్టా ఏరియాలో సంబంధించిన గ్రామాలకు ఆయకట్టు పూర్తిగా కోల్పోయినటువంటి పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉంగుటూరు, నందివాడ మండలాలు అలాగే విజయవాడ నగరంతో పాటు ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. అలాగే ఈ ముంపు వలన సార్వా రైతులు తీసుకున్నటువంటి పంట రుణాన్ని ఎవరు కూడా కట్టగలిగిన పరిస్థితిలేదని, వాళ్ళకి రుణమాఫీ చేయలేదని వెంటనే రుణమాఫీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టి నాగేశ్వరరావు, మెరుగుమాల శ్రీనివాసరావు, గొరిపర్తి వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

తెంపల్లిలో పైపులైన్ లీకేజీ

ప్రజాశక్తి-గన్నవరం : పెంపల్లిలో మంచినీటి పైపు పగిలి మురుగునీరు అందులో కలిసిపోతుంది. కలుషిత నీరు జనానికి సరఫరా అవుతుంది. దీంతో డయేరియా వస్తుందని ప్రజలు భయపడు తున్నారు. పంచాయతీ పాలకవర్గం పట్టించుకోవడంలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. గతంలో కలుషిత నీరు తాగి డయేరియా వ్యాపించి నలుగురు మరణించిన విషయం తెలిసిందే. మళ్లీ అదే పరిస్థితి వచ్చేలా ఉందని ప్రజలు భయపడుతున్నారు. పైపు లీక్ కావడంతో డ్రైనేజీలో నీరు అందులో కలిసిపోతుందని చెప్తున్నారు. ఇప్పటికైనా అధికారుల స్పందించాలని కోరుతున్నారు.





నాట్య శాస్త్రానికి యునెస్కో గుర్తింపు పట్ల హర్షం

ప్రజాశక్తి-మొవ్వ : యునెస్కో మెమొరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో నాట్య శాస్త్రాన్ని ప్రత్యేకంగా నమోదు చేశారని కేంద్ర సాంస్కృతిక పర్యాటక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ వెల్లడించారు. ఈ సందర్భంగా శనివారం కూచిపూడిలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీ సిద్ధేంద్ర యోగి కళాపీఠం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు, నాట్య విద్యార్థులు కలిసి నటరాజు కి పూలమాలవేసి ఆనందోత్సాహాలతో స్వీట్స్ పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాపీఠం సిబ్బంది, లైబ్రేరియన్ వై వి పణి కుమార్ పాల్గొన్నారు.



'వికాస్ రెయిన్‌బో'లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక సత్యనారాయణపురంలోని వికాస్ రెయిన్ బో ఇంగ్లీషు మీడియం పాఠశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న విశ్రాంత ఎం.ఇ.ఓ భవిరి శంకరనాథ్ పాల్గొన్నారు. సుమారు 60మంది విద్యార్థులు సర్టిఫికేట్లు, పట్టాలను అందుకున్నారు. విద్యార్థులు నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సెమిస్టర్ పరీక్షలు

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయ పరిధిలో 2024 -2025 విద్యా సంవత్సరపు, యు.జి రెండవ మరియు నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్ 21వ తేదీ నుండి మే 3వ తేదీ వరకు 38 పరీక్షా కేంద్రాలలో నిర్వహిస్తున్నట్లు కృష్ణా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కూన రాంజీ తెలియచేశారు. పరీక్షల నిర్వహిస్తున్న కేంద్రాలకు గూగుల్ మీట్ ద్వారా సమావేశం నిర్వహించి పరీక్షా కేంద్రాల ప్రిన్సిపాల్స్ కు తగు జాగ్రత్తలు పాటించమని దిశా నిర్దేశాలు జారీ చేశారు. ఈ సమావేశములో పరీక్షల నియంత్రణాధికారి డా: పి. వీర బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : 'ఈగిల్ క్లబ్, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన ఒక ప్రాధాన్య ప్రాజెక్ట్‌ను స్థానిక ఎవిఆర్ఎం అండ్ వీవీఆర్ఆర్ హై స్కూల్‌లో అధికారికంగా స్థానిక ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ లక్ష్మణరావు శనివారం ప్రారంభించారు. ముఖ్య అతిథి పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చట్టబద్ధమైన, చట్టవిరుద్ధమైన మత్తు పదార్థాలపై అవగాహన కలిగించి, అవి మన శరీరంలో కలిగించే ప్రతికూల ప్రభావాలను వివరించారు. చీఫ్ కో-ఆర్డినేటర్ జి.ఎం. సత్యబాబు ఈ క్లబ్‌కార్యక్రమాలను వివరిస్తూ మత్తు పదార్థాల దుర్వినియోగం, వ్యసనం వల్ల కలిగే హానికరమైన ప్రభావాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఆర్ఎం అండ్ వీవీఆర్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ఉపాధ్యక్షులు కోడాలి కృష్ణారావు, స్కూల్ డైరెక్టర్ ఎన్. శ్రీనివాస మూర్తి , ప్రిన్సిపాల్ లీనా సాతులూరి బోధన సిబ్బంది పాల్గొన్నారు.



మత్తుపదార్థాల అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులకు అర్హులను ఎంపిక చేయాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : ప్రభుత్వం 2025 డీఎస్సీలో పిఈటి, పిడి ల ఎంపికలో అర్హత కలిగిన వారిని ఎంపిక చేయటం ద్వారా సమాజానికి ఉత్తమ క్రీడాకారులను అందించగలుగుతారని ఆంధ్రప్రదేశ్ వ్యాయామ విద్యా పోరాట సమితి నాయకులు ఈ దేవేంద్ర గౌడ్ చెల్లయ్య(జమ్మూల్) డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు అవనిగడ్డలో మీడియాతో మాట్లాడుతూ 2024 ఫిబ్రవరిలో వైసిపి ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్ జీవో నెంబర్ 11 లో వ్యాయామ ఉపాధ్యాయుల నియామకంలో సిలబస్ మార్పులు చేసి ఫిజికల్ ఈవెంట్స్ స్పోర్ట్స్ మెరిట్ సర్టిఫికెట్స్ కు వెయిటేజీ మార్కులు తీసివేశారన్నారు. దీనితో క్రీడాకారులకు తీరని అన్యాయం జరుగుతుందని తెలిపారు. క్రీడల పట్ల ఎటువంటి అవగాహన లేనివారు కాలేజీకి కూడా వెళ్లకుండా డి పి డి సర్టిఫికెట్స్ కు మన రాష్ట్రం తో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా సర్టిఫికెట్లు పొందుతున్నారని తెలిపారు. అటువంటి వారిని పిఈటీలుగా ఎంపిక చేస్తే వారు పాఠశాలల్లో విద్యార్థులకు ఎటువంటి వ్యాయామ శిక్షణ ఇస్తారన్నారు. వారికే వ్యాయామం పట్ల అవగాహన లేకపోతే భవిష్యత్తులో రాష్ట్రంలో క్రీడాకారులు ఎట్లా తయారవుతారో అనే ఆందోళన కలుగుతుందన్నారు. భావితరాలకు ఉన్నతమైన క్రీడాకారులను అందించాలంటే కచ్చితంగా డీఎస్సీలో పీఈటీల ఎంపిక పారదర్శకంగా ఉండాలన్నారు. అందుకోసం తప్పనిసరిగా ఫిజికల్



ఈవెంట్స్ పరీక్ష నిర్వహించాలని వారికి తప్పకుండా(పిఈటి అండ్ పిడి) ఈవెంట్స్ కు వెయిటేజీ మార్కులు కల్పించాలని కోరారు. ఇటీవల డివైఎఫ్ఐ, వ్యాయామ విద్య పోరాట సమితి ఆధ్వర్యంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను కలిసి వినతి పత్రం కూడా ఇచ్చామన్నారు. ఈ సమావేశంలో వ్యాయామ విద్య పోరాట సమితి నాయకులు మధు, సుధాకర్, విమల్ తదితరులు పాల్గొన్నారు.



కంచికచర్లలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం, స్థానికంగా ఉన్న ప్రైవేటు హాస్పిటల్ ప్రాంగణాల్లో శనివారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరో రోజు అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఫైర్ ఆఫీసర్ టి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది అగ్ని ప్రమాదాలు సంభవించి నప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై డెమో నిర్వహించారు. కరపత్రాలు బ్రోచర్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కె.ప్రవీణ్ కుమార్, కె.జయరాం, జి.శేఖర్ బాబు, ఎం.శ్రీనివాసరావు, ఎం.అశోక్, షేక్ తాజుద్దీన్, బి.సంజయ్ వర్మ, జి.రాజశేఖర్, జీవి నరస్సయ్య, షేక్ సుభాని, ఎస్ శ్రీనివాస్, జి జీవన్, ప్రభుత్వ వైద్యాధికారులు, పాల్గొన్నారు.

విస్సన్నపేట : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం విస్సన్నపేట అగ్నిమాపక కేంద్ర సిబ్బంది ఆధ్వర్యంలో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు, సలహాలు పలు చర్యల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డాక్టర్స్, ఆరోగ్య కేంద్ర సిబ్బందికి, ఇతర సిబ్బందికి ఫైర్ సిబ్బంది తెలిపారు. అనంతరం హాస్పిటల్‌లో జరిగే ఎలక్ట్రికల్ అండ్ ఫైర్ సేఫ్టీ మీద సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ పావని పాల్గొన్నారు.

వైసిపి అనుబంధ విభాగాల కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండల వైసిపి అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది బండి మల్లిఖార్జునరావు, కంచికచర్ల పట్టణ అధ్యక్షుడిగా వేమా సురేష్ బాబా పదవీ బాధ్యతలు చేపట్టి ప్రమాణ స్వీకారం చేశారు. శనివారం వైసిపి జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఎంఎల్‌సి డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక ఖగన్మోహన్‌రావు సిఫార్సు మేరకు మండల పార్టీ అధ్యక్షుడిగా బండి మల్లిఖార్జునరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడిగా వేమా సురేష్ బాబు నియమితులయ్యారు. బండి మల్లిఖార్జునరావు సీనియర్ న్యారవాదిగా, ప్రస్తుతం కంచెకచర్ల వైస్ ఎంపిపిగా ఉన్నారు. వేమా సురేష్ బాబు గత దశాబ్ద కాలంగా పట్టణ వైసిపి అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కంచికచర్ల పంచాయతీ ఉప సర్పంచ్‌గా బాధ్యతలో ఉన్నారు. వీరితో పాటు జాల్లా వైసిపి ప్రధాన కార్యదర్శులుగా సీనియర్ నాయకులు కాలవ పెదబాబు, పాటిబండ్ల హరిజగన్నాధరావు, బిసి సెల్ విభాగం నుండి పరిటాలకు చెందిన మార్త శ్రీనివాసరావు బాధ్యతలు తీసుకున్నారు. వైసిపి రీజనల్ కో ఆర్డినేటర్ వైవి సుబ్బాలెడ్డి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు.

కూటమిలో రజకులకు ప్రాధాన్యత లేదు

ప్రజాశక్తి - మైలవరం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నామినేటెడ్ పోస్టుల్లో మైలవరం నియోజకవర్గంలో రజక సామాజిక వర్గానికి ప్రాధాన్యత కల్పించక పోవడం ఆ వర్గాన్ని అణగదొక్కే ప్రయత్న మేనని మైలవరం నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షులు తాళ్లూరి శేషగిరిరావు శనివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలో రాటానికి రజక సామాజిక వర్గంలోని ప్రతి కార్యకర్త కృషి చేశారని అన్నారు. వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్న గౌడ్ వర్ధంతి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : బీసీ నాయకులు స్వాతంత్ర సమరయోధులు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న గౌడ్19 వ వర్ధంతి సందర్భంగా కొండపల్లి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల ప్రధాన కార్యదర్శి సాకిరి వెంకట నరసయ్య యాదవ్ ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

మైలవరం : సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతిని మైలవరంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్ అండ్ బి కార్యాలయం సమీపంలో ఉన్న గౌతు లచ్చన్న విగ్రహానికి వైఎస్ఆర్సిపి, తెలుగుదేశం, జనసేన నాయకులు ఘనంగా నివాళులర్పించారు.

స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలంటూ పిలుపునిస్తూ పలుచోట్ల అధికారులు సిబ్బంది, ప్రజల చేత ప్రతిజ్ఞలు చేయించారు. పరిసరప్రాంతాలను శుభ్రం చేశారు.

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి సన్నిధిలో శనివారం ఉదయం స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి అనుగుణంగా, పరిసరాలు స్వచ్ఛంగా ఉంచేందుకు గానూ రాష్ట్రప్రభుత్వ ఉత్తర్వులు అనుసరించి దేవస్థానం రాజగోపురం ముందు "స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ" చేశారు. ఆలయంలోని పలు విభాగాల అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సహాయ కార్యనిర్వహణాధికారి పి.చంద్ర శేఖర్ ఆలయ సిబ్బందితో పరిసరాల శుభ్రత, ఆలయ స్వచ్ఛత గురించి అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. **విజయవాడ :** చిత్త రంజన్ గ్రేడ్-2 శాఖ గ్రంథాలయం సత్యనారాయణ పురంలో శనివారం గ్రంథాలయ పాఠకులచే ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయ అధికారి పి.సంపత్ కుమార్ మొదటిగా గ్రంథాలయ పాఠకులచే స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. తదుపరి ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించి, గ్రంథాలయ ర్యాకులలోని పుస్తకాలు, మొక్కలలో, గ్రంథాలయ ఆవరణ పరిసర ప్రాంతాలు పరిశుభ్ర పరిచారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **మైలవరం :** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని డిపిఒ లావణ్య కుమారి పేర్కొన్నారు. శనివారం స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వ్యర్థాల నివారణ – పర్యావరణ పరిరక్షణపై వివిధ శాఖల వారికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఒ లావణ్య కుమారి మాట్లాడుతూ తడి, పొడి చెత్త సేకరణతో సంపద తయారీ, ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఇండ్లలో పాడైపోయిన ఎలక్ట్రానిక్ వ్యర్థాల ద్వారా జీవరాసికి హాని కలిగించే రేడియేషన్ ఉత్పత్తి అవుతుందని తద్వారా పర్యావరణంలో కాలుష్యం ఏర్పడుతుందని అన్నారు. దానిని నివారించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ప్రజలు తమ ఇంట్లో పాడైపోయిన పాత ఎలక్ట్రానిక్ వస్తువులను విధిగా చెత్త సేకరించి పంచాయతీ సిబ్బందికి అప్పగించాలని సూచించారు. ఈ సంధర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛ మైలవరం కోసం శ్రమిస్తున్న కార్మికులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, జిల్లా వైద్యాధికారి సుహాసిని, డాక్టర్. ప్రియాంక, ఎంఇఒ బాలు, పంచాయతీ కార్యదర్శి ఎండి.రఫీ, శానిటరి ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** పట్టణంలోని పురపాలక సంఘ పరిధిలో శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘ కార్యాలయం నుండి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం యన్‌టిఆర్ సర్కిల్‌లో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్ రావు, మున్సిపల్, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** స్వచ్ఛ ఆంధ్ర సృష్టికి మన వంతు బాధ్యతను నెరవేర్చుదాం కార్యక్రమంలో భాగంగా కొండపల్లి పురపాలక సంఘం నిర్వహించిన ర్యాలీలో టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఈ–వ్యర్థాలను సరిగ్గా రీసైకిల్ చేయడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్డీవో కృష్ణ చైతన్య, కొండపల్లి మున్సిపాలిటీ కమిషనర్ రమ్య కీర్తన, ఎఈ మౌసామి కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, పాల్గొన్నారు. **తిరువూరు :** తిరువూరులో శనివారం జరిగిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ తిరువూరు కార్యక్రమంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొని పారిశుధ్య కార్మికులతో కలిసి మురుగు కాలువలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడుతూ మనతోపాటు మనచుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జి.లోవరాజు, సచివాలయాల సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** మండలంలోని గండ్రాయి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గండ్రాయి మెయిన్‌లో శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని డ్వామా పీడీ రాము, మండల అభివృద్ధి అధికారి నితిన్ ప్రారంభించారు. ముందుగా పాఠశాల విద్యార్థులు, అంగన్వాడీ టీచర్స్, సచివాలయ ఉద్యోగులు, మరియు గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లూర్ధుమేరి, గ్రామ పెద్దలు నాగరాజు, గ్రామ సెక్రటరీ సంధ్య, సచివాలయ సెక్రటరీ రమాదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు, ఉపాధ్యాయులు సుబ్బారావు, రమాదేవి, దేవదానం, పద్మావతమ్మ, కృష్ణంరాజు, అంగన్వాడీ టీచర్లు, సచివాలయం సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** డాక్టర్ నార్ల తాతారావు తాప విద్యుత్ కేంద్రములో సి – కాలనీ నందు స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమమును చీఫ్ ఇంజినీర్ టి. నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజినీర్ టి. నాగరాజు మాట్లాడుతూ దేశంలోనే అత్యంత పరిశుభ్రత గల రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు, పారిశుధ్యముగా ఉంటే అనారోగ్యం కలుగదన్నారు.



ఇబ్రహీంపట్నంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరేలా చూడాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని బలుసుపాడు ప్రాథమిక పాఠశాలలో శనివారం జగ్గయ్యపేట మండల విద్యాశాఖాధికారి ఎల్.చిట్టిబాబు సమక్షంలో గ్రామంలోని రెండు అంగన్వాడీ సెంటర్‌ల నుండి 20 మంది విద్యార్థులకు ఒకటవ తరగతిలోకి అడ్మిషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ పాఠశాలలో ఐదో తరగతి పూర్తి చేసిన 16 మంది విద్యార్థులకు రికార్డు షీట్ ఇచ్చి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బలుసుపాడు ప్రధానోపాధ్యాయులకు ఆరో తరగతి అడ్మిషన్ నిమిత్తం అప్పగించారు. ఈ విధంగానే మిగతా గ్రామాల్లో కూడా ఉపాధ్యాయులు నాలుగు రోజులు పాటు ప్రణాళికలు వేసుకొని విద్యార్థులను జాయిన్ చేసి జిల్లాలోనే పరుగుతో పాఠశాలలలో ఎక్కువ అడ్మిషన్లు జగ్గయ్యపేట మండలానికి వచ్చేలా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్.వెంకటేశ్వరరావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శెట్టి దుర్గాప్రసాద్, హైస్కూల్ ఉపాధ్యాయులు బి.వి.రమణ, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు జె.వెంకటేశ్వర్లు, వి.దుర్గాప్రసాద్, ఎ.నరసింహారావు, టి.సునీత, అంగన్వాడీ టీచర్లు మార్తి ఉషారాణి, శకుంతల, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రహదారిపై భద్రతా చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :

65వ నెంబర్ జాతీయ రహదారి తోటచర్ల, కొనకంచి, నవాబుపేట, భీమవరం, వెంకట సాయి ఫుడ్ ప్లాజా, ఎస్ఎం పేట, బలుసుపాడు, గరికపాడు చెక్‌పోస్ట్‌లలో మెరిడియన్ వద్ద తగినంత లైటింగ్‌ను ఏర్పాటు చేయాలని జాతీయ రహదారి అధికారి, జగ్గయ్యపేట సిఐలకు వినతిపత్రం అందజేశారు. ఈ ఏడు జంక్షన్లు జగ్గయ్యపేట సర్కిల్ పరిధిలోని జాతీయ రహదారికి 28 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్నాయి. ఈ పాయింట్ల వద్ద తగినంత లైటింగ్, భద్రతా చర్యలు దృశ్యమాన్యతను గణనీయంగా పెంచుతాయని, ప్రమాదాలను నివారిస్తాయని హైవే అధికారులు వివరించారు. ఈ ప్రదేశాలలో 2 నెలల్లోపు అన్ని భద్రతా చర్యలను ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

గురుకుల పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్దన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని బలుసుపాడు రోడ్‌లో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం బాలికల, పాఠశాల కళాశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో నేత్ర వైద్య శిబిరం, డెంటల్, జనరల్ మెడిసిన్ ద్వారా నేత్ర పరీక్షలు, రక్త పరీక్షలు, 468 మంది బాలికలకు నిర్వహించి ఉచితంగా మందులు, దంత పరీక్షలు చేసి మౌత్ పేస్టులు అందజేశారు. కంటి లోపం ఉన్నవారికి కళ్ళజోళ్ళు అందించారు. ఈ కార్యక్రమ సభలో జయప్రద ఫౌండేషన్ చైర్మన్ మాట్లాడుతూ పిల్లలలో ఉన్న పోషక లోపములు గుర్తించి వారికి తగిన మందులు డాక్టర్ల సూచన మేరకు కళ్ళజోళ్ళు మా ఫౌండేషన్ ద్వారా అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఎంఎల్ఎ శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ జయప్రద ఫౌండేషన్ సేవలు అభినందనీయమన్నారు. ప్రిన్సిపల్ కే లక్ష్మి సుజాత మాట్లాడుతూ గురుకుల పాఠశాల అభివద్ధి పిల్లలకు వచ్చిన ర్యాంకులు 500 మార్కులు 478 మార్కులు సాధించిన గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభను తెలిపారు. నెట్టెం రఘురాం విద్యార్థులను, పాఠశాల టీచర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుదీప్తి, పౌండేషన్ ప్రతినిధి చాముండేశ్వరి, ఫౌండేషన్ కోఆర్డినేటర్ కట్ట వెంకట నరసింహారావు, వెలమాటి చంద్రమౌళి, ముల్లంగి రామకష్ణారెడ్డి, మండల సమైక్య అధ్యక్షురాలు గద్దే రాజ్యలక్ష్మి, పాల్గొన్నారు.

గోనె సంచుల కొరత తీర్చండి

ప్రజాశక్తి - తిరువూరు : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు తలె త్తకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సతీష్ పేర్కొన్నారు. తిరువూరు మండలం, వావిలాల గ్రామంలో రైతులు ఆరబోసిన ధాన్యంను శనివా రం ఆయన అర్డీఓ మాధురీ తో కలిసి పరిశీలించి ధాన్యం కొనుగోలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆయన రైతులను అడిగి తెలుసుకున్నారు. గోనె సంచుల కొరత ఉందని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వావిలాల సొసైటీ పరిధిలో ఉన్న గ్రామాల్లోని ధాన్యం కొనుగోలుకు సంచులు కొరత లేకుండా చూస్తామని, ఇప్పటికే 2000 సంచులు పంపామని మేనేజర్ తెలిపారు. సంచులు కొరత లేకుండా చేస్తామని చెప్పారు. ప్రతి రైతు ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లక్ష్మి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న సతీష్

స్వచ్ఛాంధ్రపై ర్యాలీలు, ప్రతిజ్ఞలు



గుడివాడ మండలం చౌటపల్లి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


మోపిదేవి దేవస్థానంలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కృష్ణా జిల్లాలోని పలుచోట్ల పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అలాగే ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ చేపట్టి అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల కలిగే నష్టాలు ప్రజలకు తెలియచేసి స్వ చ్ఛాంధ్ర పతిజ్ఞ చేయించారు.

ప్రజాశక్తి- మచిలీపట్నంఅర్బన్ : నగర పాలక సంస్థ పరిధిలో మూడో శనివారం సందర్భంగా స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఏప్రిల్ నెల ప్రాధాన్యత అంశం అయిన ఈ వేస్ట్ చెక్ నందు ఎలక్ట్రానిక్ వద్ద వ్యర్థాలను సేకరించి శాస్త్రీయంగా తొలగించడంపై అవగాహన కల్పించారు. ఈ వేస్ట్ సేకరించుట కొరకు కలెక్షన్ పాయింట్‌ను వెహికల్ డిపో లో ప్రారంభించారు. వెహికల్ డిపో నుండి కోనేరు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ చోడే వీర వెంకట సత్య బాపూజీ, జనసేన పార్టీ ఇన్చార్జి బండి రామకష్ణ వార్డు కార్పొరేటర్లు దింటకుర్తి సుధాకర్, జి గోపీచంద్ మోటమర్రి బాబా ప్రసాద్ తదితరులు పాల్గొని స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు.

అలాగే మచిలీపట్నం నగర కార్పొరేషన్ 45వ డివిజన్ పరిధిలో శనివారం వ్యర్థాల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. సచివాలయ సిబ్బంది, డివిజన్ శానిటేషన్ సిబ్బంది తో కలిసి తెలుగుదేశం పార్టీ 45వ డివిజన్ ఇంచార్జ్, పివి ఫణి కుమార్ స్వచ్ఛత కార్యక్రమాలను పర్యవేక్షించారు. డ్రైనేజీలలో ప్లాస్టిక్ తో ఉన్న వ్యర్థాలను తీసివేసి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** మండలంలో శనివారం ఎంపీడీవో రవికాంత్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర నిర్వహించారు. పనికిరాని విద్యుత్తు వైర్లు, పరికరాలు ప్రజా ఆరోగ్య సమస్యలు తెచ్చిపెడుతున్నా యని ప్రత్యేక డ్రైవ్ ద్వారా వీటిని అన్ని గ్రామాల నుంచి సేకరించామని ఎంపీడీవో రవి కాంత్ తెలిపారు. ఇందులో భాగంగా అన్ని గ్రామాలలో ఉన్న వ్యర్థ పదార్థాలను 481 కేజీలను సేకరించమని తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్రలో భాగంగా ఈ వేస్ట్ కలెక్షన్ డ్రైవ్ చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. బీసీ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, టిడిపి మండలాధ్యక్షులు వీరపనేని శివరాం ప్రసాద్, రామినేని వెంకటకుటుంబ నరసింహారావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి గూడూరు :** గూడూరు గ్రామ పంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ లింగం.సులోచనరాణి, గూడూరు మండల పరిషత్ అధ్యక్షులు సంగా మధుసూదనరావు, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపిడిఓ ఎం వనజ పాల్గొన్నారు.

ప్రతి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి : ఎస్పి

ప్రజాశక్తి- కలక్టరేట్ (కష్ణా) : స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ ఆర్.గంగా ధరరావు, ఆదేశాల మేరకు కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ అధికారులు, సిబ్బంది స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. నిరంతరం సమస్యతో ఉన్న ప్రజలు అనేకమంది పోలీస్ స్టేషన్కు వచ్చి వెళుతూ ఉండగా వారు వచ్చే ప్రదేశం పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉన్నప్పుడు వారి సమస్య సగం వరకు పరిష్కారమైన ఆలోచన వస్తుందని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సబ్ డివిజన్ కార్యాలయాలు, సర్కిల్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ ఆవరణ ను శుభ్రపరిచి, మొక్కలు నాటారు. **ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ :** ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం రోజురోజుకు పెరుగుతున్న పరిస్థితుల్లో, కాలంచెల్లిన వస్తువులను జాగ్రత్తగా ధ్వంసం చేయకపోతే ముప్పు తప్పదని ఇంజినీరింగ్ కళాశాల డీన్ ఆచార్య వైకె సుందర కష్ణ పేర్కొన్నారు. స్వర్ణాంధ్రా.స్వచ్ఛంద్రా కార్యక్రమంలో భాగంగా శనివారం ఎన్ ఎస్ ఎస్ విభాగం ఆధ్వర్యంలో కష్ణా విశ్వవిద్యాలయంలో ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛం ద్రా - స్వర్ణాంధ్రా సమన్వయకర్త డాక్టర్ ఎం శ్రావణి, సహాయ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే మచిలీపట్నం మండలం కానూరు పంచాయతీలోని వన్నారు కానూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కృష్ణా జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర ,స్వచ్ఛాంద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాల వలన వచ్చే సమస్యల గురించి వివరించారు. అనంతరం ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించి పాఠశాలనుని శుభ్రపరిచి ,స్కూల్ విద్యార్థులతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ, చేయించారు.

మోపిదేవి దేవస్థానంలో స్వచ్ఛ ప్రతిజ్ఞ

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో మూడో శనివారం స్వచ్ఛ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఆలయ పరిసరాలన్నీ వ్యర్థాలను తొలగించి పరిశుభ్రంగా ఉంచారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని డిప్యూటీ కమిషనర్, ఆలయ కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆలయ సిబ్బందితో చేయించారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** ఎలక్ట్రానిక్స్ రకాలు పర్యావరణానికి హానికరం చేస్తాయని ఎంపీడీవో టీ విజయ సారథి అన్నారు. మండలం నుండి ఇ వేస్ట్ నుండి గన్నవరం ఈ వేస్ట్ సెంటర్ కి శనివారం తరలించారు. పంచాయతీ కార్యదర్శి ఏజేఎల్ నరసింహారావు, విజయ్, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, పరిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ (గన్నవరం) :** బాపులపాడు మండలం. వీరవల్లి గ్రామంలో హైస్కూల్ నుండి పోలీస్ స్టేషన్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మానవ హారం ఏర్పడి సింగిల్ యూస్ ప్లాస్టిక్, ఎలెక్ట్రానిక్ వ్యర్థాలను గ్రామపంచాయతీ వారికి అప్పగించాలని సర్పంచ్ పిల్లా అనిత ప్రజలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో గ్రామ ప్రముఖులు గుండపనేని ఉమావం ప్రసాద్, లంకా సురేంద్ర మోహన్ బెనర్జీ, కలపాల రాజబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉంగుటూరు : మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో విజయవంతంగా నిర్వహించామని ఇఓపిఆర్ డి దిలీప్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో మానవహారం నిర్వహించి తడి చెత్త స్వభావాన్ని, పొడి చెత్త విభాగాలను వివరించారు. పంచాయతీరాజ్ ఎఇ శ్రీనివాస్, ఆర్ డబ్ల్యూ ఎస్ ఏఇ స్రవంతి, గ్రామ పంచాయతీ సర్పంచ్ లు, కార్యదర్శులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** కంకిపాడు పంచాయతీ కార్యాలయంలో స్వర్ణాంద్ర- స్వచ్ఛాంధ్ర శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు ఎంఎల్‌ఎ బోడే ప్రసాద్, కంకిపాడు మండల జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి సుంకర శివ, కంకిపాడు గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు బోయిన నాగరాజు, తాడిగడప మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అనుమోను ప్రభాకర్, సర్పంచ్ భాకీ రమణ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఎస్.జగన్ మోహనరావు పాల్గొని మాట్లాడారు. ఎలక్ట్రానిక్స్ కు సంబంధించిన సెల్ ఫోన్లు గాని,పాత చార్జర్లు గాని, కంప్యూటర్లకు సంబంధించిన సామాగ్రి గాని నిల్వ ఉంచటం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జి బి ఆనంద కుమార్, బంటుమిల్లి ఎంపీడీవో శైలజ, వైస్ ప్రిన్సిపాల్ బండి దేవ జయరాజు, విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** తడి చెత్త పొడి చెత్త వేరు చేసి సంపద కేంద్రాలకు తరలించాలని, అన్ని గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని ఎంపిడిఓ వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పమిడిముక్కల ఉన్నత పాఠశాల ఆవరణలో పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. అలాగే తాడంకి, మంటాడ, కష్ణాపురం, లంకపల్లి తదితర గ్రామాల్లో కూడా స్వచ్ఛత గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు తాళ్లూరు వెంకటరమణ, విజయదుర్గ, ప్రసాదు, స్వామి, లక్ష్మి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉయ్యూరు, మండల పరిధి గ్రామాల్లో ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ చేపట్టి అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఉయ్యూరు నగర పంచాయతీ చైర్మన్ వి సత్యనారాయణ, కమిషనర్ పి వెంకటేశ్వరరావు మసీదు సెంటర్లో ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల కలిగే నష్టాలు ప్రజలకు తెలియచేసి స్వ చ్ఛాంధ్ర పతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహించిన ఈ వేస్ట్ అవగాహన కార్యక్రమంలో అభివద్ధి కమిటీ చైర్మన్ జయదేవ్, వైద్యులు మురళి, నాగస్వరూప పా ల్గొన్నారు. ఈసందర్భంగా వైద్యశాల ఆవరణలో మొక్కలు నాటారు. కాటూరులో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిరావు, ఈఓపీఆర్డీ గ్రామ కార్యదర్శి సుబ్బారావు, సర్పంచ్ ఆశాజ్యోతి, శేషవరప్రసాద్ పాల్గొని ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ చెక్ అనే థీమ్ కింద కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి పర్యవేక్షణలో కంప్యూటర్ సైన్స్ విభాగ అధిపతి స్వర్ణ జ్యోతి విద్యార్థులతో కలిసి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని వివిధ విభాగాల నుండి ఈ వేస్ట్ సేకరణ, శుభ్రత కార్యక్రమం తో పాటు మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు కూడా నిర్వహించారు. **ప్రజాశక్తి - గుడివాడ :** గుడివాడ మండలం చౌటపల్లి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ప్రతినెలలో మూడవ శనివారం గ్రంథాలయంలో పరిసరాల పరిశుభ్రత, వేస్ట్ మేనేజ్మెంట్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రమ్య, పంచాయతీ కార్యదర్శి హరికష్ణ, సచివాలయ సిబ్బంది, గ్రంథాలయ నిర్వహకుడు జి.రత్నచంద్ర, సిబ్బంది రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు



ప్రజాశక్తి-అవనిగడ్డ : ఐఎన్‌టిఎస్‌ఓ జాతీయ స్థాయి పరీక్షలలో అవనిగడ్డకు చెందిన శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు 174 మంది బహుమతులు సాధించారు. శనివారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు మెడల్స్ సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల ఈజీఎం మురళీకష్ణ, ఆర్ఐ రాజేష్ ఏ సి ఓ అశోక్ డి సుధాకర్, ఇన్చార్జ్ శివాజీ ఏవో శ్రీనివాస్, ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు .

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి



ప్రజాశక్తి-పమిడిముక్కల : రైతులందరూ తప్పక భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి అన్నారు. శనివారం పమిడి ముక్కలలో భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలతో భూమి నాణ్యత, భూమిలో ఉండే పోషక విలువలను తెలుసుకోవ చ్చన్నారు. ఈ వేసవికాలంలోనే మండలంలోని రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.


క్రీడాకారులను అభినందిస్తున్న యలవర్తి శ్రీనివాసరావు

ఎన్‌టిఆర్ స్టేడియం స్కేటింగ్ క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి - గుడివాడ : ఈ నెల 11వ తేదీ నుండి 17వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రం, మొహలీలో 2వ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఓపెన్ నేషనల్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్షిప్-2025 పోటీలు జరిగాయి. ఈ పోటీలలో ఎన్‌టిఆర్ స్టేడియం స్కేటింగ్ క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించారు. వివరాల ప్రకారం కెడెట్ 7-11 బాలికల విభాగంలో వి.ఆషిత, కె. కారుణ్య శ్రీ, విష, కె. వైష్ణవిలు పాల్గొని కాంస్య పతకం సాధించారు. ఎన్.టి.ఆర్. స్టేడియం స్కేటింగ్ కోచ్ వి.రాజా శిక్షణలో ఈ క్రీడాకారులు విజయాన్ని సాధించారు. ఈ సందర్భంగా ఎన్.టి.ఆర్. స్టేడియం కమిటీ వైస్ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కిలారపు రంగ ప్రసాద్ లు విజయం సాధించిన క్రీడాకారులను అభినందించారు.

22న మాజీ సైనికులకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్ : ఉమ్మడి కష్ణా జిల్లాలలో మద్రాసు రెజిమెంట్‌కు చెందిన మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి మెరుగైన సేవలు అందించడానికి మద్రాస్ రెజిమెంట్ సెంటర్ తరపున అవగాహన సదస్సును ఈనెల 22వ తేదీన నిర్వహిస్తున్నట్లు విశ్రాంత లెఫ్టినెంట్ కమాండర్ కే కళ్యాణ వీణ తెలిపారు. ఎన్‌టిఆర్‌లోని విజయవాడలోని జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయం వేదికగా ఈ అవగాహన సదస్సు జరుగుతుందన్నారు. ఎన్.టి.ఆర్. జిల్లా, కష్ణా జిల్లాలలో మద్రాసు రెజిమెంట్‌కు చెంది న మాజీ సైనికులు, వారికి సంబంధించిన కుటుంబాలలో ఉన్న వితంతువులు వారి డిశ్చార్జ్ బుక్, పెన్షన్ పేమెంట్ ఆర్డర్ (పి పి ఓ), ఐకార్డ్, ఆధార్ కార్డ్‌తో ఈ అవగాహనలో పాల్గొనాలని కోరారు.

క్రీడల కోటా 3 శాతం ఇవ్వడంపట్ల హర్షం

ప్రజాశక్తి-గన్నవరం : క్రీడల కోటా 3 శాతం అమలుకు జి.వో 4ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విడుదల చేయడం పట్ల ఆంధ్రప్రదేశ్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘంఉపాధ్యక్షులు, ఒలింపిక్ సంఘం ప్రతినిధి ధనియాల నాగరాజు శనివారం నాడు హర్షం ప్రకటించారు. జి. వో విడుదల తరువాత 65 క్రీడలకు 3 శాతం క్రీడల కోటా రిజర్వేషన్ ఎ కేటగిరి, బి కేటగిరి వారీగా వర్తిస్తుందని ధనియాల వివరించారు.

డాక్టర్ భానుమూర్తి పుట్టినరోజు వేడుకలు



ప్రజాశక్తి-మచిలీ పట్నం అర్బన్ : వైద్య వత్తిని ఎంచు కొని ఎందరికో కంటికి వెలుగునిచ్చిన డాక్టర్ భానుమూర్తి పుట్టిన రోజు వేడు కలు శనివారం జిల్లా సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో ఘన ంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం అంబేద్కర్ జయంతి, బాబు జగజ్జీవన్ రావు జయంతి సందర్భంగా పలు ప్రాంతాలలో తన సొంత ఖర్చులతో పేదవారికి అనేక ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. వైద్య రంగాల్లో కంటి శస్త్ర చికిత్స నిపుణులుగా ఎంతోమందికి చూపు ప్రసాదించి ఎనలేని కీర్తిని గడించారు. ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో మొదటిగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెంట్ ఆశాలత, ఆర్ ఎం ఓ నిరంజన్ రావు సిబ్బంది పుష్పగుచ్చాలతో శు భాకాంక్షలు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ శ్రీనివాసరావు

జెఈఈ మెయిన్స్‌లో శ్రీ శ్రీనివాస గ్రావిటీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : జెఈఈ మెయిన్స్ – 2025 ఫలితాల్లో నగరంలోని శ్రీ శ్రీనివాస గ్రావిటీ కళాశాల విద్యార్థులు అత్యధిక పర్సంటైల్ సాధించారని కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి శ్రీనివాసరావు, సెక్రటరీ పరుచూరి నీలిమ తెలిపారు. ఈ సందర్భంగా మొగల్రాజపురంలోని కళాశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అత్యంత ప్రతిభ కనబరచిన విద్యార్థులను అభినంందించారు. అనంతరం పరుచూరి శ్రీనివాసరావు, నీలిమ మాట్లాడుతూ, జేఈఈ మెయిన్స్‌లో తమ విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులు సాధించడం గర్వాకారణమన్నారు. పరీక్షకు హాజరైన 100 మంది విద్యార్థుల్లో 45 మంది 90 శాతం పర్సంటేజ్ సాధించారని చెప్పారు. వివిధ కేటగిరీల్లో 34 మంది అడ్వాన్స్‌కు సెలెక్టు అయ్యారని తెలిపారు. తమ విద్యార్థి ఒ.చాందినీ ఆలిండియా 758వ ర్యాంకు సాధించడంతో పాటు ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ప్రతి ఏటా జెఈఈ మెయిన్స్‌లో తమ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనపరుస్తున్నారని పేర్కొన్నారు. అలాగే ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో కూడా తమ విద్యార్థులు రాష్ట్ర స్థాయి అత్యుత్తమ మార్కులు సాధించారని గుర్తుచేశారు. అధ్యాపకుల కృషి, తల్లిదండ్రుల సహకారంతోనే ఏటా మంచి ఫలితాలను సాధిస్తున్నామని పరుచూరి శ్రీనివాసరావు, నీలిమ వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వై.పి.ఆర్ పాల్గొని విద్యార్థులకు మొక్కలు అందజేసి అభినందించారు.

శ్రీనిధి విద్యార్థులకు ర్యాంకులు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు శ్రీనిధి జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జెఇఇ మెయిన్స్ జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ వి.శ్రీనివాస రావు తెలిపారు. కార్తిక్ 1860, ఎ.వెనిల్ 2,448 ర్యాంకులతో గ్రామీణ ప్రాంత విద్యార్థుల సైతం అత్యుత్తమ ప్రతిభ కనబరచటం అభినందనీయమని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను శ్రీవాహిణి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రంగా నాగేంద్రబాబు, చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, సెక్రటరీ ఊటుకూరు సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ పోట్రు నాగేశ్వరరావు, ట్రెజరర్ ముత్యాల కిషోర్ బాబు అభినందించారు.



ఎస్ఆర్ జూనియర్ కాలేజి విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : జేఈఈ మెయిన్స్ 2025 ఫలితాల్లో గొల్లపూడిలోని ఎస్ఆర్ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఇద్దరు ఆల్ ఇండియా ర్యాంకులు, 11 మంది 10 వేలు లోపు ర్యాంకులు, 53 మంది జెఇఇ అడ్వాన్స్ (ఐఐటి) రాయడానికి అర్హత సాధించారని విజయవాడ జోనల్ ఇన్‌చార్జి కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్ ఇండియాలో సుమారు 18 లక్షల మంది ఈ పరీక్ష రాశారని తెలిపారు. ఈర్ల బిందుశ్రీకి ఆల్ ఇండియా ర్యాంక్ 142, సిహెచ్.షణ్ముఖ సాయికి ఆల్ ఇండియా ర్యాంక్ 274 సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎస్.ఆర్.జూనియర్ కాలేజెస్ ఎపి జనరల్ మేనేజర్ రాజేంద్రప్రసాద్, ఎపి డిజిఎమ్ రమణ, ఎపి అకాడమిక్ కోర్ డీన్ అరవింద్, విజయవాడ అకాడమిక్ డీన్ శంకర్ రావు, జోనల్ ఇంచార్జి మహేంద్ర రెడ్డి, ప్రిన్సిపాల్స్, బ్రాంచి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

ఇంటర్‌లో హవా

ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాలు తమ హవాను కొనసాగించాయి. రాష్ట్రస్థాయిలో కృష్ణాజిల్లా ప్రథమ స్థానం, ఎన్‌టిఆర్ జిల్లా మూడో స్థానంలో నిలవడం అభినందనీయం. ఇంటర్ బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో కృష్ణాజిల్లా వరుసగా పదోసారి ప్రథమ స్థానం పొందింది. 2024–25లో కష్ణాజిల్లా నుంచి 24,571 మంది విద్యార్థులు మొదటి సంవత్సరం పరీక్షలకు హాజరుకాగా, 20,885 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 20,885 మంది హాజరుకాగా, 19,523 ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో 61 శాతం, రెండో సంవత్సరం ఫలితాల్లో 79 శాతం సాధించి కృష్ణాజిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే మొవ్వ ప్రభుత్వ జూనియర్ కళాశాల 87 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వ కళాశాలల ఉత్తీర్ణతలో ప్రథమ స్థానంలో నిలిచింది. అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాల 83.5 శాతం దక్కించుకుని రెండో స్థానంలో, మచిలీపట్నం లేడీ యాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 79 శాతంతో మూడోస్థానంలో నిలిచాయి. మంచి ఫలితాలు సాధించి కృష్ణా జిల్లాను వరుసగా ప్రథమ స్థానంలో నిలిపిన విద్యార్థినీ విద్యార్థులకు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు, కలెక్టర్ కూడా అభినందనలు తెలిపారు. అలాగే ఎన్‌టిఆర్ జిల్లా కూడా రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం సాధించడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 89 శాతం, మొదటి సంవత్సరంలో 81 శాతం ఫలితాలను సాధించి కృష్ణా, గుంటూరు జిల్లాల తర్వాత మూడో స్థానంలో నిలిచింది. ఈ జిల్లా నుండి



మొత్తం మొదటి సంవత్సరం విద్యార్థులు 39,200 మంది విద్యార్థులు హాజరుకాగా, 31,676 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 35,484 మంది హాజరుకాగా, 31,736 మంది ఉత్తీర్ణత సాధించి 89 శాతం ఫలితాలను పొందారు. గత ఏడాది జిల్లా సగటు ఉత్తీర్ణత 87 శాతం కాగా, ఈ ఏడాది 2 శాతం పెరిగింది. అలాగే రాష్ట్రంలోని 294 జడ్‌పి హైస్కూల్ ప్లస్ పాఠశాలల స్థాయిలో చూసుకుంటే మైలవరం జడ్‌పి గర్ల్స్ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకోవడం ఆనందించదగ్గ విషయం. ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో 14 మందికి 14 మంది ఉత్తీర్ణత సాధించారు. ఆ పాఠశాలకు చెందిన విద్యార్థులు స్టేట్ హైస్కూల్ ప్లస్‌లలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. ఒకేషనల్ విభాగంలో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించి అందరి అభినందనలు అందుకున్నారు. అయితే కృష్ణా జిల్లాలోని ప్రభుత్వ ప్లస్ టూ పాఠశాలల్లోని విద్యార్థులు మాత్రం సగటు ఉత్తీర్ణత కూడా సాధించలేకపోయారు. ఇది ఆ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలపై ప్రభావం చూపే పరిస్థితి ఏర్పడింది. అడ్మిషన్లు ప్రక్రియ ప్రారంభించే క్రమంలో ప్లస్ టూ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల్లో నాణ్యత పెంచడానికి ప్రభుత్వం ఇంకా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పలుచోట్ల ప్రభుత్వ జూనియర్, సీనియర్ కళాశాలలు పూర్తిస్థాయిలో సౌకర్యాలు అందుబాటులో లేవు. మచిలీపట్నం, అవనిగడ్డ, మొవ్వ, బంటుమిల్లి, పామర్రుల్లో మాత్రమే ప్రభుత్వ కళాశాలలున్నాయి. 2022లో మండలానికి ఒకటి చొప్పున జిల్లాలోని 24 ఉన్నత పాఠశాలలను ప్లస్ టూ పాఠశాలలుగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. మొదటి, ద్వితీయ సంవత్సర ఇంటర్ విద్యకు ప్రవేశాలను కల్పించింది. అయితే పూర్తిస్థాయిలో బోధన సిబ్బందిని నియమించకపోవడం, మౌలిక వసతులు కల్పించకపోవడంతో ఈ పాఠశాలల్లో ఇంటర్ అడ్మిషన్లు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చర్యలు తీసుకుని సిబ్బంది భర్తీ, మౌలిక వసతుల కల్పనకు వేగంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- డెస్క్

ఆకాష్ విద్యార్థుల ప్రతిభ

99.94 పర్సంటైల్‌తో వంశీ కృష్ణా రెడ్డి అగ్రస్థానం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : జెఈఈ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో ఆకాష్ విజయవాడ బ్రాంచ్ విద్యార్థులు 99శాతం కంటే ఎక్కువ పర్సంట్ సాధించారని కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్.వి.ఎస్.నరేష్ తెలిపారు. బెంజ్ సర్కిల్ వద్ద గల ఆకాష్ సంస్థలో జెఈఈ మెయిన్స్‌లో అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన సభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరానికి చెందిన సానేపల్లి వంశీ కృష్ణా రెడ్డి 99.94 శాతం సాధించి ప్రతిభ కనపరిచాడని అన్నారు. ఒక్క విజయవాడ బ్రాంచ్ నుండి మరో ఐదుగురు విద్యార్థులు 99 శాతం కంటే ఎక్కువ సాధించారని అన్నారు. ఆకాష్ అందిస్తున్న కోర్సు, కరికులం వల్ల ప్రతి ఏటా జెఇఇ మెయిన్స్‌లో అద్భుత ప్రతిభ కనపరిచారని అన్నారు. మధుసూదన రెడ్డి యేరువ, ఉజ్వల్ బాపన్న దొర, నిదేశ్ ఏమినేని, నితీశ్ రామ్ సుంకర, బొత్స గౌతమ్‌లు 99 శాతం పర్సంటైల్ సాధించారని తెలిపారు. దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ప్రవేశ పరీక్షలలో ఒకటిగా గుర్తింపు పొందిన ఐఐ టీ – జె ఈ ఈ లో ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఇందులో భాగంగానే తమ సంస్థ అత్యధిక మంది విద్యార్థులకు ఐఐటీలో సీటు సాధించేలా కృషి చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ చీఫ్ అకడమిక్ అండ్ బిజినెస్ హెడ్ ధీరజ్ కుమార్ మిశ్రా, స్టేట్ హెడ్ ఆర్.వి.నారాయణ మూర్తి, బ్రాంచ్ హెడ్ మహేంద్ర విద్యార్థులను అభినందించారు.


విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

శారదా కళాశాల విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : జెఈఈ మెయిన్స్ – 2025 ఫలితాల్లో నగరంలోని గాంధీనగర్‌లోని శారదా జూనియర్ కళాశాల విద్యార్థులు మరోసారి విజయకేతనం ఎగురవేశారు. ఈ సంవత్సరం జరిగిన జెఈఈ మెయిన్స్ పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించి ఉత్తీర్ణుల య్యారు. పసుమర్తి బిందుశ్రీ యశస్విని 88.22 శాతంతో అత్యుత్తమ మార్కులు సాధించి అడ్వాన్స్‌కి అర్హత సాధించిందని, మరో విద్యార్థి ఈమని శాండిల్ ప్రణవ కృష్ణ 83.73 శాతంతో ఉత్తమ పర్సెంటేజ్ సాధించినట్లు కళశాల సెక్రటరీ కుందా రామనారాయణ, కరస్పాండెంట్ ఎస్.ఎన్.వి.వరప్రసాద్‌లు తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో, విట్ వంటి ప్రఖ్యాత ఇంజనీరింగ్ కళాశాలలో సీటు పొంది కళాశాలకి మంచి పేరు తీసుకొచ్చారని పేర్కొన్నారు. అధ్యాపకుల కృషికి నిదర్శనంగా తమ కళాశాల విద్యార్థులు అద్భుత ఘనత సాధించడం కళాశాలకే గర్వకారణమని తెలిపారు. ఈ సందర్భంగా జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లుక్కా శ్రీధర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

ఇంటర్ ఫలితాల్లో కెవిఆర్ కాలేజీ ప్రభంజనం

విజయవాడ : ఇంటర్ ఫలితాలలో పట్టణంలోని కెవిఆర్ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ వెంకట దుర్గారావు తెలిపారు. సీనియర్ ఇంటర్ ఫలితాల్లో 1000 మార్కులకు గానూ ఎంపిసి విభాగంలో పి.నవదీప్ అత్యధికంగా 983 మార్కులు సాధించాడని, సలోని కుమారికి 982మార్కులు, మల్లె బోయిన లోకేష్‌కి 979 మార్కులు, పిలక మోహన్ సాత్విక్‌కి 969 మార్కులు, వెంకట వీరాంజనేయులు 968 మార్కులు, డి.రాజా కార్తీక్ 967 మార్కులు, జొన్నకూటి లోహిత్ 966 మార్కులు సాధించినట్లు తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపిసిలో మహమ్మద్ ఫజ్జాలునిషా 470 మార్కులకు గానూ 465 మార్కులు సాధించింది. కందుకూరి మనస్విని 463 మార్కులు, ఐ.నిఖిల్ 462 మార్కులు, బొగ్గుల వెంకట అశ్వితారెడ్డి 461 మార్కులు, కాసరనేని ప్రణవ 459 మార్కులు, వి.మోహన్ సాయి అర్జున్ 457 మార్కులు, కె.నాగతేజస్ 455 మార్కులు సాధించారు. సీనియర్ బైపిసి విభాగంలో 1000కి గానూ కొర్రపాటి హర్షిణికి 982 మార్కులు, చిన్న బత్తిని కెజియ కేర్లయిన్‌కి 978 మార్కులు సాధించినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులందరినీ కళాశాల చైర్మన్ కె.వెంకటేశ్వరరావు, కళాశాల డీన్.టి.అనూష, ప్రత్యేక అభినందనలు తెలిపారు.

